V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
10-07-2024
సంపుటి : 01 | సంచిక : 67 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## సిరాజ్‌కు సీఎం అభినందనలు

ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయించాలని ఆదేశం

అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నావని ముఖ్యమంత్రి కితాబు

2



## గచ్చిబౌలి ఫ్లైఓవర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- కోర్టు కేసులు ఏమున్నా వాటిపై దృష్టి సారించాలి
- జీహెచ్ఎంసి కమిషనర్ అమ్రాపాలి కాట

**విశ్వంభర, హైదరాబాద్ :** గచ్చిబౌలి ఫ్లైఓవర్ పనులను వేగవంతం పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రాపాలి కాట అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి వద్ద చేపడుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించి మిగతా2లో...

## కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్పీ విలీనం?

దానికోసం రేవంత్ ప్రయత్నాలు

ఇప్పటికే చాలా మంది చేరిక

మరింత మందిని చేర్చుకునేందుకు చర్చలు



**విశ్వంభర, హైదరాబాద్ :**

తెలంగాణ చట్టసభల్లో బలం పెంచుకునే ప్రయత్నం చేస్తోంది కాంగ్రెస్. ఒకవైపు ఎమ్మెల్యేలు, మరోవైపు ఎమ్మెల్సీలను చేర్చుకుంటూ.. అసెంబ్లీలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అడుగులు వేస్తోంది. వచ్చే అసెంబ్లీ సెషన్స్‌కు ముందే శాసనమండలిలో తిరుగులేని పార్టీగా అవతరించాలని చూస్తోంది హస్తం పార్టీ. తెలంగాణ శాసనమండలిపై కాంగ్రెస్ పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ఎమ్మెల్యేల ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపి సీరియస్‌గా అమలు చేస్తున్న కాంగ్రెస్.. అసెంబ్లీ సమావేశాల్లోపు బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునేందుకు సీఎం రేవంత్ కసరత్తు ముమ్మరం చేశారు. అటు మండలిపై కూడా గురిపెట్టి.. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్సీలను వరుసగా చేర్చుకుంటున్నారు. మెల్లగా మండలిలో బలం పెంచుకుంటున్నారు. మండలిలో గవర్నర్ కోటా రెండు ఖాళీలుండగా.. ప్రస్తుతం 39మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్‌కు 19మంది, కాంగ్రెస్‌కు 13మంది, బీజేపీ 1, ఎంఐఎం 2, స్వతంత్రులు మిగతా2లో...



వచ్చే ఏడాది చివరిలోపు

# కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలి

## యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్న సీఎం

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి కావాలి

రూ. 396.09 కోట్ల పనులకు శంకుస్థాపన

మహబూబ్ నగర్‌లో రేవంత్ రెడ్డి పర్యటన

సీఎం వెంట జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, మహబూబ్ నగర్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా రూ. 396.09 కోట్ల అభివృద్ధి పనులకు రేవంత్ శంకుస్థాపన చేశారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రూ.353.66 కోట్లతో వివిధ అభివృద్ధి మిగతా2లో...

## పాత్రికేయులకు ఇచ్చిన మాట తప్పం

- జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో సమావేశం
- మంత్రి పొన్నం ప్రభాకర్

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన మాటను తప్పేది లేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.



2

## డీఎస్సీ అభ్యర్థులపై కాంగ్రెస్ దగా

- లక్షలాది మంది ఆక్రందన సర్కారుకు వినపడటం లేదా..?
- అధికారంలోకి రాగానే ఉస్మానియా యూనివర్సిటీని రణరంగంగా మార్చారు
- సోకాల్డ్ మేధావులెక్కడ?
- ఇచ్చిన మాట ఏమైంది
- మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం



2

## షర్మిల వల్లే జగన్ ఓడిపోయాడు

- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- పవన్ సొంతంగా పోటీ చేస్తే ఫలితాలు వేరేలా ఉండేవి
- షర్మిలను ఎన్నికల అవసరాలకు వాడుకున్నారంటూ వ్యాఖ్య

2



## జాతీయ రహదారుల నిర్మాణానికి పూర్తి సహకారం

6

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 114 | ₹ 136 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 197 | ₹ 224 |



## అమ్మవారి కళ్యాణోత్సవంలో తోపులాట వెనుక కుట్ర కోణం

మంత్రి కొండా సురేఖ

2

## ఫిరాయింపులపై కేటీఆర్‌కు మాట్లాడే అర్హత ఉందా..?

- ఫిరాయింపులకు పాల్పడినప్పుడు మీ నీతి ఏమైంది?
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది రోజుల నుంచే ప్రభుత్వాన్ని కూల్చేస్తాం అని రెచ్చగొట్టింది మీరే కదా..
- టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీమధుయాష్కిగౌడ్



2

# భారత్ ను చూసి ప్రపంచం ఆశ్చర్యపోతోంది

## ఏ దేశానికీ సాధ్యంకాని చంద్రయాన్ సాధించాం

డిజిటల్ పేమెంట్లలో సరికొత్త రికార్డులను సృష్టించాం

మూడో ఆర్థిక శక్తిగా నిలబెడుతా

ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన



**విశ్వంభర, ఢిల్లీ:**

రష్యాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన కొనసాగుతోంది. రెండో రోజైన ఇవాళ ఆయన మాస్కోలో భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. తాను ఒక్కడినే ఇక్కడికి రాలేదని.. 140 కోట్ల మంది ప్రేమను తీసుకొచ్చానని తెలిపారు. భారతదేశ మట్టి వాసనను మోసుకొచ్చినట్లు చెప్పారు. ఇటీవలే మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణం చేశానన్న మోదీ.. మూడు రెట్లు వేగంగా పనిచేయాలని అప్పుడే నిర్ణయించుకున్నట్లు చెప్పారు. భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలబెడతానని ఈ సందర్భంగా వాగ్దానం చేశారు. భారత్ ఘనత ప్రపంచం గుర్తించకతప్పని పరిస్థితి తెచ్చామని వ్యాఖ్యానించారు. మాస్కోలో భారతీయులను ఉద్దేశించి ప్రసంగిస్తూ వివిధ రంగాల్లో భారత్ సాధించిన అభివృద్ధిని వారికి వివరించారు. మిగతా2లో...

## సిరాజ్‌కు సీఎం అభినందనలు

**విశ్వంభర, హైదరాబాద్ :** అంతర్జాతీయ క్రికెట్‌లో భారత దేశానికి, మన తెలంగాణ రాష్ట్రానికి గొప్పపేరు, గౌరవాన్ని తెచ్చిన అల్ రౌండ్ క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌ను ముఖ్యమంత్రి ఏ.రేవంత్రెడ్డి అభినందించారు. టీ20 వరల్డ్ కప్‌ను గెలుచుకున్న అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్న సిరాజ్ మంగళవారం ఉదయం ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సిరాజ్ను ఘనంగా సన్మానించారు. మహ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని, అందుకే ఈ రోజు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు సంపాదించుకున్నారని ముఖ్యమంత్రి ప్రశంసించారు. సిరాజ్ కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో లేదా చుట్టుపక్కల ప్రాంతాల్లో అందుకు అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలసిందిగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## ఫిరాయింపులపై కేటీఆర్ కు మాట్లాడే అర్హత ఉందా..?

- టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీమధుయాష్కిగౌడ్

**విశ్వంభరా హైదరాబాద్ :** ఫిరాయింపులను ప్రోత్సహించి, రాజకీయ వ్యవస్థని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ నాయకులు.. ఇప్పుడు నీతులు మాట్లాడడం సిగ్గుచేటని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కి గౌడ్ గారు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలపై కేటీఆర్, హరీష్ రావులు కాంగ్రెస్ పై చేసిన విమర్శలపై మధుయాష్కి గౌడ్ తీవ్రంగా స్పందించారు. మంగళవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో ప్రతిపక్ష పార్టీలను చీల్చి, రాజకీయాల్లో విలువలను దిగజార్చిన ఘన చరిత్ర కెసిఆర్ కుటుంబానిదన్నారు. అలాంటి వారు ఈరోజు ఫిరాయింపులపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కొక్కరిగా ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ఫిరాయింపులు గుర్తు రాలేదా కేటీఆర్..? అని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ పార్టీకి 88 మంది ఎమ్మెల్యేలు, దాని మిత్రపక్షం ఎంఐఎం కు 7 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. ఎవరి గడ్డి కరవడానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలవగా.. ఒక్కొక్కరిగా 12 మందిని టిఆర్ఎస్ లో చేర్చుకొని కండువాలు కప్పిన విషయాన్ని ఎవరు మర్చిపోరు అన్నారు. 2019లో ఉత్తంకుమార్ రెడ్డి గారు ఎంపీగా గెలుపొంది ఎమ్మెల్యేగా రాజీనామా చేసిన తరువాత .. కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 18 కి పడిపోగా.. 2/3 మెజార్టీ వచ్చిందని భావించి, అప్పుడు 12 మంది ఎమ్మెల్యేలతో విలీన ప్రక్రియ కోసం లెటర్ ఇచ్చారని గుర్తు చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది రోజుల నుంచే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని, కూలిపోతుందని ఒకవైపు బీఆర్ఎస్ నేతలు కెసిఆర్ కేటీఆర్..మరోవైపు బిజెపి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తమ మాటలతో బీరాలు పలికి రెచ్చగొట్టిన సంగతి మర్చిపోయారా? అని ప్రశ్నించారు. కెసిఆర్ ని త్వరలో ముఖ్యమంత్రిని కూడా చేసుకుందామంటూ జనవరి 25న కరీంనగర్ సభలో కేటీఆర్ వ్యాఖ్యలు.. వారి బెదిరింపు మాటలకు నిదర్శనం అన్నారు. మీ బెదిరింపు మాటలతోటే ఈరోజు కాంగ్రెస్ పార్టీ తలుపులు తెరిచి పార్టీలోకి వచ్చే వారందరినీ ఆహ్వానించాల్సి వస్తుందన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి ఒక్కొక్కరుగా తమ పార్టీలోకి వస్తున్నారని, త్వరలో 2/3 మెజార్టీ మార్క్ దాటడం ఖాయమని పేర్కొన్నారు. దేశం మొత్తంలోనే రాజకీయాల్లో విలువలను నీచంగా దిగదార్చిన వ్యక్తి కెసిఆర్ అని మండిపడ్డారు. పదేళ్ల తన రాజరిక పాలనలో డబ్బు సంస్కృతిని విపరీతంగా పెంచి పోషించారన్నారు. దోచుకున్న అవినీతి సొమ్ము తో మళ్లీ అధికారంలోకి వస్తామన్న అహంకారంతో ఎన్నికల్లో పోటీ చేసి.. ప్రజలిచ్చిన తీర్పుతో బొక్క బోర్ల పడ్డాడని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ పార్టీ అని చెప్పి, తెలంగాణకు కాపలా కుక్కలమని చెప్పి.. పదేళ్లపాటు ప్రజలను మభ్యపెట్టి దోచుకున్నారని, ఏనాడైతే వారి పార్టీ నుంచి తెలంగాణ పదం తీసేశారో ఆనాటి నుంచే బిఆర్ఎస్ పతనం మొదలైంది అన్నారు. ఇక ఆ పార్టీ తెలంగాణలో భూస్థాపితం కావడం ఖాయం అన్నారు.

## కాంగ్రెస్‌లో బీఆర్ ఎస్ ఎల్పీ విలీనం..?

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎంపీ ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ బలం ఐదుగురు ఎమ్మెల్సీలే. ఎంపీ ఎన్నికల సమయంలో పట్నం చేరికతో అది ఆరుకు చేరింది. ఇటీవల ఒకేసారి ఆరుగురి చేరికతో.. కాంగ్రెస్ బలం 12కు పెరిగింది. తాజాగా చల్లా వెంకట్రామిరెడ్డి సీఎంను కలవడంతో ఆయన చేరిక కూడా లాంఛనమే అని తెలుస్తోంది. దీంతో మండలిలో కాంగ్రెస్ బలం 13కు చేరింది. బీఆర్ఎస్‌కు చెందిన చాలామంది ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తమకు నెక్స్ట్ టర్మ్ రెన్యూవల్ చేస్తే చేరేందుకు రెడీగా ఉన్నట్లు సమాచారం. అయితే పార్టీ పాలసీ ప్రకారం ముందే హామీ ఇవ్వలేమని పార్టీలో చేరితే మాత్రం సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యనేతలు భరోసా ఇస్తున్నారు. మండలిలో 2/3 మెజారిటీ సాధిస్తే బీఆర్ఎస్ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేయొచ్చు అనే భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. మరో 9 మంది MLCలని పార్టీలోకి ఆకర్షించి 2/3 మెజారిటీ కంప్లీట్ చేసే యోచనలో ఉంది కాంగ్రెస్. పెద్దల సభలో బలం పెంచుకుని.. హస్తగతం చేసుకోవాలని.. కాంగ్రెస్ భావిస్తోంది. అంతేకాదు భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకొచ్చే కీలక బిల్లులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలంటే మండలిలో మెజారిటీ చాలా అవసరం. సో.. ఎమ్మెల్సీలతో మాట్లాడే బాధ్యతను సీఎం రేవంత్ పలువురు మంత్రులకు అప్పచెప్పినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి మండలి విషయంలో వేగంగా అడుగులు వేయడానికి కారణాలు లేకపోలేదు. తాను ప్రత్యక్షంగా కాంగ్రెస్‌లో చేరకపోయినా.. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. తన కొడుకు అమిత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీలో చేర్పించి కేసీఆర్ కు షాక్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండలి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. అందుకే అసెంబ్లీ సెషన్స్‌కు ముందే మెజార్టీ ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లోకి చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆషాడానికి ముందే టాస్క్ పూర్తి చెయ్యాలని, బీఆర్ఎస్ వైఫల్యాలు వారితోనే చెప్పించాలని కాంగ్రెస్ భావిస్తోంది. కొన్నిచోట్ల చేరికలను స్వాగతిస్తుంటే, మరికొన్ని చోట్ల వ్యతిరేకత వినిపిస్తోంది. ఇక ఈ చేరికలు కాంగ్రెస్ పార్టీకి ఏ మేరకు కలిసి వస్తాయో చూడాలి..!

## గచ్చిబౌలి ఫ్లైఓవర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

భూ సేకరణను వేగవంతం చేయాలని, అందుకోసం సేకరించాల్సిన ఆస్తుల యజమానులకు టీడీఆర రూపంలో అందజేసే ప్రక్రియను ముమ్మరం చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి కోర్టు కేసులు ఏమున్నా వాటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం ఐఐటీ జంక్షన్, లింగంపల్లి ఆర్ యు బి, మజీద్ బండ పరిసరాలను కమిషనర్ ఆమ్రపాలి తనిఖీ చేశారు. జంక్షన్ల అభివృద్ధి, ఫ్రీ లెఫ్ట్ ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు నెలకొనకుండా అధికారులు పలు విభాగాలతో సమన్వయం చేసుకుంటూ కూడళ్లను మరింత సుందరీకరించాలని అన్నారు. కొత్త ప్రాజెక్టులకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ సూచించారు. మసీద్ బండ గచ్చిబౌలి రోడ్డు వరకు విస్తరణ కోసం చేపట్టిన పనులలో కోర్టులో పెండింగ్ లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఐటీ ప్రాంతంలో సుందరికరణ పనులు, రహదారి విస్తరణ పనులు వేగంగా జరగాలని ఆమ్రపాలి స్పష్టం చేశారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఎస్.ఆర్.డి.పి సిఈ దేవానంద్, ప్రాజెక్టు విభాగం అధికారులు, ఇతర విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులపై కాంగ్రెస్ దగా

**విశ్వంభర, హైదరాబాద్ :** డీఎస్సీ వాయిదా వేయాలంటూ, పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై అక్రమ కేసులు, నిర్బంధం, అరెస్ట్ చేయటాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అని చెప్పి ఇప్పుడు వారిని దగా చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి కేబిట్‌లోనే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ అని ఇచ్చిన మాట తొమ్మిది నెలలు కావస్తోన్న ఏమైదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. లక్షలాది మంది డీఎస్సీ అభ్యర్థుల ఆక్రందన కాంగ్రెస్ సర్కారుకు వినపడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి మీరు కొలువుదీరితే సరిపోతుందా? యువతకు కొలువులు అక్కర్లేదా ? అని కాంగ్రెస్ సర్కార్‌ను కడిగి పారేశారు. ఉస్మానియా విద్యార్థులన్నా.. అక్కడ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులన్నా సీఎంకు ఎందుకంతా కోపమో చెప్పాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా విద్యార్థులు అడ్డమీద కూలీల్లాంటి వారని... తిన్నది అరిగేదాకా అరిచే బీరు బిర్యానీ బ్యాచ్ అని బద్నాం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. సిద్ధాంతం, ఆలోచన లేని ఆవారా టీమ్ అని వారి అవహేళన చేసిన మీరే...అదే విద్యార్థులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చారన్న సంగతి మర్చిపోవద్దన్నారు.

అధికారంలోకి రాగానే నేడు అదే ఉస్మానియా యూనివర్సిటీని రణరంగంగా మార్చి...డీఎస్సీ అభ్యర్థులపై పోలీసులను ప్రయోగించి అణచివేస్తున్నారని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తున్నారని...వందల మందిని అన్యాయంగా అరెస్టు చేసి అక్రమ



కేసులు పెడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం దేశ సరిహద్దుల్లో ఉందా? అక్కడికి అన్ని బలగాలను తెచ్చి ఎందుకంతా నిర్బంధాన్ని విధిస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. మళ్లీ ఉస్మానియాలో ఉద్యమం నాటి పరిస్థితులను రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకొస్తుందంటూ కేటీఆర్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ చేతకానితనాన్ని ప్రశ్నించడమే వాళ్లు చేసిన నేరమా? ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడగడమే పాపమా? అని రేవంత్ సర్కార్ ను కేటీఆర్ నిలదీశారు.

ముఖ్యమంత్రిగా మీకు మోకా వస్తే.. డీఎస్సీ అభ్యర్థులకు ఇంత ధోకా చేస్తారని ఊహించలేదన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ అని.. నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారు. ఇప్పుడు ప్రిపరేషన్‌కు కూడా టైమ్ ఇవ్వకుండా.. వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడటం ఎంత వరకు కరెక్ట్ అన్నారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ డీఎస్సీ అభ్యర్థులు కోరుతుంటే వారి డిమాండ్‌ను పరిశీలించటంలో ఎందుకింత మొండి వైఖరో చెప్పాలన్నారు. న్యాయమైన డిమాండ్లను ఆడబిడ్డలు అడిగినంత మాత్రాన అర్థరాత్రి వరకు అక్రమంగా నిర్బంధిస్తారా? ఇదేనా మహిళలంటే.. ముఖ్యమంత్రికి ఉన్న గౌరవం అని కేటీఆర్ ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే నోటిఫికేషన్లు.. అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇస్తామన్నారు. ఇప్పుడు కనీసం సీఎం అపాయింట్మెంట్ కూడా నిరుద్యోగులకు ఎందుకు ఇవ్వడం లేదు. నిరుద్యోగులంతా ఈ ప్రభుత్వం వైఖరిని గమనించాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న దృష్టి.. పోరుబాట పట్టిన నిరుద్యోగులపై లేకపోవడంపై కాంగ్రెస్ సిగ్గుపడాలన్నారు కేటీఆర్.

### సోకాల్డ్ మేధావులెక్కడ?

ఇన్నాళ్లు కాంగ్రెస్ సర్కార్‌ను భుజాన మోసిన సోకాల్డ్ మేధావులు ఇప్పుడు ఎక్కడున్నారని... ప్రశ్నించే గొంతులు ఎందుకు మూగబోయాయో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. ఇప్పటికైనా డీఎస్సీ పరీక్షల వాయిదా, పోస్టుల పెంపు డిమాండ్లు నెరవేర్చాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ జెండా వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి ప్రదర్శిస్తే నిరుద్యోగులతో కలిసి మరో ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

## పాత్రికేయులకు ఇచ్చిన మాట తప్పం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**విశ్వంభర, హైదరాబాద్ :** పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన మాటను తప్పేది లేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి , హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (HUJ) ఆధ్వర్యంలో జరిగిన సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ స్మారక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిలతో కలిసి మంత్రి పొన్నం పాల్గొన్నారు. హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగ శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అయిన కాంగ్రెస్... ప్రజల సమస్యలు పరిష్కరించడంలో చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రభుత్వానికి , ప్రజలకు మధ్య వారధిగా మీడియా తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధి, అంకితభావంతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి, వాటిని పరిష్కరించడంలో మీడియాది ప్రముఖ పాత్ర ఉంటుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో హెచ్.యూ.జే తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పాత్రికేయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే న్యాయం జరుగుతుందన్నారు. అక్రిడేషన్ , హెల్త్ కార్డ్స్ , ఇండ్ల స్థలాల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ మెమోరియల్ అవార్డ్ స్మారక పురస్కారాన్ని సీనియర్ జర్నలిస్ట్, ఐజేయు కార్యదర్శి వై నరేందర్ రెడ్డికు ప్రదానం చేశారు. మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి, టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన కె.విరాహత్ అలీలతో పాటు, కార్యదర్శి వి.యాదగిరి, కోశాధికారి వెంకట్ రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్ కుమార్, టియుడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్, అనిల్, గౌస్ మోహినుద్దీన్ తదితరులను మంత్రి పొన్నం సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, ఐజేయు కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, హెచ్.యూ.జే కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి కళ్యాణోత్సవంలో తోపులాట వెనుక కుట్ర కోణం



**మంత్రి కొండా సురేఖ అన్నారు**

**విశ్వంభర, హైదరాబాద్ :** బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి కళ్యాణోత్సవం సందర్భంగా నేడు జరిగిన తోపులాట వెనుక కుట్ర కోణం దాగుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దేవాలయానికి వచ్చిన సందర్భంలో కొందరు రాజకీయ ప్రేరేపిత అల్లరి మూకలు కావాలని తోపులాటకు దిగి శాంతిభద్రతల సమస్య తలెత్తేలా కుట్రకు పాల్పడ్డారని మంత్రి సురేఖ తెలిపారు. పోలీస్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ మంత్రి సురేఖ మందలించారు. బల్కంపేట అమ్మవారి దేవాలయం కళ్యాణోత్సవంలో నేడు అవాంఛనీయ ఘటనలు జరిగిన నేపథ్యంలో మంత్రి సురేఖ, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంత రావు, జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, అడిషనల్ సిపి (లా అండ్ ఆర్డర్) విక్రంసింగ్ మాన్, వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్, దేవాదాయ శాఖ డిప్యూటి కమిషనర్ రామకృష్ణారావు, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, రాష్ట్రస్థాయి బోనాల కమిటి మెంబర్లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బల్కంపేట బోనాల ఉత్సవాల్లో పోలీసుల నిర్లక్ష్యం కారణంగా రాజకీయ ప్రేరేపిత అరాచక శక్తులు నేడు శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు పన్నాగం పన్నాయని మంత్రి సురేఖ అన్నారు. ఆషాఢ బోనాల జాతర ఉత్సవాల్లో లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు వరుస సమావేశాలు నిర్వహించామని మంత్రులు తెలిపారు. అయినా ఈ సంఘటన జరగడం వాంఛనీయంకాదని మంత్రి అన్నారు. ఆ సమయంలో ఓ మహిళా జర్నలిస్టును డ్యూటీలో ఉన్న ఎస్సై దుర్భాషలాడిన విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి సంబంధిత అధికారి పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంత్రి సురేఖ పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. పోలీసులు సిసి కెమెరాల ఫుటేజ్ పరిశీలినతో పాటు స్థానికంగా వుంటూ ఉత్సవాలకు హాజరైన ప్రజల నుండి వివరాలను రాబట్టి రేపటి లోగా నివేదిక సమర్పించాలని మంత్రి సురేఖ పోలీస్ శాఖను ఆదేశించారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న పోలీసులకు సంబంధించిన సమాచారాన్ని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. అధికారులు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రతిష్టను మసకబరిచేందుకు ఎవరు ప్రయత్నించినా సహించబోమని మంత్రులు స్పష్టం చేశారు. పోలీస్ శాఖ అత్యుత్సాహంతో భక్తులు కు కలిగిన ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని మంత్రులు అన్నారు. జరిగిన లోపాల పై సమీక్ష చేపట్టాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో బోనాల ఉత్సవాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకుగాను దేవాదాయ శాఖ సిబ్బందికి వాకీటాకీలు అందించాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ఆషాఢ బోనాల ఉత్సవాలు ముగిసేవరకు నిరంతరం శాఖాపరమైన సమీక్షలు చేపట్టాలని సూచించారు. నేటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రేపటి నుంచి జరగబోయే ఉత్సవాల్లో పిల్లలు, వృద్ధులు, జోగినీలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ప్రతి శాఖ నిరంతరం అలెర్ట్ గా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మహంకాళి జాతర బోనాల ఉత్సవాల్లో పాల్గొననున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. అల్లరిమూకల తోపులాట తర్వాత సేదతీరేందుకు తాను ఓ గద్దె పై కూర్చుంటే మంత్రి అలిగి దేవాలయం బయట కూర్చున్నాడంటూ సోషల్ మీడియాలో దురుద్దేశంతో చేసిన ట్రోల్స్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసు ఉన్నతాధికారులతో ప్రస్తావించారు. సదరు అకౌంట్ పై సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసి, దోషులను శిక్షించాలని సూచించారు. కొందరు దురుద్దేశంతో చేసే పోస్ట్ లతో సోషల్ మీడియా ప్రతిష్ట మసకబారుతున్నదని అన్నారు. పోలీస్, ఎండోమెంట్, జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, రెవెన్యూ, ఆరోగ్యం, విద్యుత్ తదితర కీలకమైన శాఖలు సమన్వయంతో సాగుతూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ ఆదేశించారు.

## భారత్ ను చూసి ప్రపంచం ఆశ్చర్యపోతోంది

(మొదటి పేజీ తరువాయి)

'ఏ దేశానికీ సాధ్యంకాని విధంగా చంద్రయాన్ ప్రయోగం చేపట్టి విజయం సాధించాం. చంద్రుని దక్షిణధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా గుర్తింపు పొందాం. దేశం మారుతోందని ప్రపంచమంతా గుర్తిస్తోంది. విదేశాల్లో ఉంటున్న భారతీయులు దేశాన్ని చూసి గర్విస్తున్నారు. డిజిటల్ పేమెంట్లలో సరికొత్త రికార్డ్‌లను సృష్టించాం. స్టార్టప్‌ల్లో ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరుకున్నాం. 2014లో వందల్లో ఉన్న స్టార్టప్‌లు నేడు లక్షల్లోకి చేరాయి. భారత్ రికార్డు స్థాయిలో పేటెంట్లను సాధిస్తోంది. ప్రపంచంలో అతి పెద్ద ఆరోగ్య బీమా వ్యవస్థ భారత్‌లో ఉంది. భారతదేశం మారుతోందని ప్రపంచమంతా గుర్తించింది. గత 10 ఏళ్లలో భారత్ సాధించిన అభివృద్ధి వేగాన్ని చూసి ప్రపంచం మొత్తం ఆశ్చర్యపోతోంది. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించాం. పదేళ్లలో 40 వేల కి.మీ. ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్యను రెట్టింపు చేశాం. రైల్వే లైన్లను ఎలక్ట్రిఫికేషన్ చేశాం. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించాం. అభివృద్ధిలో 140 కోట్ల మంది ప్రజల భాగస్వామ్యం ఉంది. టీ20 వరల్డ్ కప్ గెలిచి దేశం సంబరాలు చేసుకుంది. భారత్ ఘనతను ప్రపంచం గుర్తించక తప్పని పరిస్థితికి తెచ్చాం. దేశంలోని ప్రతీ ఒక్కరిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాం. ఆత్మవిశ్వాసం భారత దేశానికి అతిపెద్ద ఆయుధం. మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే పటిష్ఠమైనది'' అంటూ మోదీ చెప్పుకొచ్చారు.

## షర్మిల వల్లే జగన్ ఓడిపోయాడు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పేదలకు పెద్ద ఎత్తున పథకాలు ఇచ్చినా వైఎస్ జగన్ ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. అయినా 40 శాతం ఓట్లు వైసీపీ సాధించడం మాములు విషయం కాదన్నారు. మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా చిట్ చాట్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే కూటమితో కాకుండా పవన్ కల్యాణ్ విడిగా పోటీ చేసి ఉంటే ఫలితాలు మరో విధంగా ఉండేవన్నారు. వైఎస్ జగన్‌ను ఓడించేందుకు వైఎస్ షర్మిలను వస్తువులా వాడుకున్నారన్నారు. అంతకు మించి షర్మిల ఏమీ లేదని చెప్పారు. ప్రతిరోజూ జనంలోకి వెళ్ళే ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి ఓడిపోవడం కూడా ఆశ్చర్యమేనన్నారు. మాకు అహంకారం ఉందని కృత్రిమంగా సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. అహంకారం, ఆత్మ విశ్వాసం తేడా తెలియక, అభివృద్ధిలో మాతో పోటీ పడలేని వారే అహంకారం అని ప్రచారం చేశారన్నారు. ప్రజలతో మాకు గ్యాప్ వచ్చిన మాట వాస్తవం అన్న కేటీఆర్, తమ వైఖరి మార్చుకోవాల్సి ఉందన్నారు. హైదారాబాద్ లో అన్ని సీట్లు గెలిచాం, అభివృద్ధిని మేము జనానికి చెప్పుకోలేకపోయామన్నారు. తెలంగాణ పేరు మార్చడం వల్ల ఓడిపోయామనడానికి ఆధారం లేదనన్నారు. మరోవైపు, తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల అంశం పొలిటికల్ హీటెక్కిస్తోంది. బీఆర్ఎస్ కాంగ్రెస్ నేతల మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మరో ఆరుగురు ఎమ్మెల్సీలను చేర్చుకుంది. ఈ ఇష్యూని సీరియస్‌గా తీసుకున్న గులాబీపార్టీ నేతలు హస్తినలో రాజ్యాంగ, న్యాయ నిపుణులను సంప్రదించారు. ఎన్నికల కమిషన్‌తోపాటు సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దేశంలో పార్టీ ఫిరాయింపులను మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.

## వచ్చే ఏడాది చివరిలోపు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పనులకు శంకుస్థాపన చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ.42.40 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.10 కోట్లతో నిర్మించబోయే బాలికల హాస్టల్ నిర్మాణానికి, దేవరకద్రలో రూ.6.10కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి, మహబూబ్‌నగర్ రూరల్‌లో రూ.3.25 కోట్లతో కేజీవీబీ భవన నిర్మాణానికి, గండీడ్‌లో రూ.6.20 కోట్లతో కేజీవీబీ భవన నిర్మాణానికి, పాలమూరు యూనివర్సిటీలో రూ.13.44 కోట్లతో ఎస్టీపీ, అకాడమిక్ బ్లాక్, గ్యాలరీ పనులకు, మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ.37.87 కోట్లతో సీసీ రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ పనులకు, రూ.276.80 కోట్లతో ఎస్టీపీ నిర్మాణానికి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులతో కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. డిసెంబర్ 2025 లోగా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడంలో గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రాజెక్టు పనుల్లో పురోగతిని ప్రతి నెలా సమీక్ష నిర్వహించాలని చెప్పారు. నిర్ధేశిత గడువులోగా కల్వకుర్తి పూర్తి చేసే ప్రణాళికలో భాగంగా క్షేత్రస్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు.

## గ్రామ సమైఖ్య సంఘాలకు

# కోటి ఆర్థిక సాయం అందించాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**



**విశ్వంభరా హైదరాబాద్ :** రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయడం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వనమహోత్సవం, మహిళాశక్తి, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, వ్యవసాయ సంబంధిత అంశాలు, ధరణి, ఉద్యోగుల బదిలీలు, గృహనిర్మాణం తదితర అంశాలపై నేడు జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ శాఖ ముఖ్యకా ర్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్, సెర్ప్ సిఈఓ దివ్య, మున్సిపల్ శాఖ డైరెక్టర్ గౌతమ్, లా సెక్రటరీ తిరుపతి తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ క్రింది అంశాల వారీగా సి.ఎస్. సమీక్షా సమావేశం నిర్వహించారు.

### ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

రాష్ట్రంలో భూ సంబంధిత వివాదాలకు సంబంధించి అందిన ధరణి ఫిర్యాదుల పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపించాలని జిల్లా కలెక్టర్లను సి.ఎస్ శాంతి కుమారి ఆదేశించారు. ఇప్పటికే, గత రెండున్నర యేళ్లుగా 57 వేల దరఖాస్తులకు పైగా జిల్లాల్లో పరిష్కారించారని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంలో గణనీయ-ంమైన పురోగతి ఉందని ప్రశంసించారు. మిగిలినవి రాబోయే 10 రోజుల్లో పరిష్కరించాలన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా మరింత సమ-ర్థవంతమైన సేవలను ప్రజలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

### రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో పంటసాగు

గత సంవత్సరం, ఈ నాటికి, 44 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా ప్రస్తుత వానా కాలం సీజన్ లో ఇప్పటికే 50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారని అన్నారు. అన్ని మండలాల్లో సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీని జిల్లా కలెక్టర్లు ప్రతీ రోజూ పర్యవేక్షించాలని సి.ఎస్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 9 ఉమ్మడి జిల్లాల్లో రైతు భరోసా సదస్సులను నిర్వహిస్తు న్నామని, ఈ సదస్సులకు ఆయా జిల్లాలోని రైతులు, రైతు ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రస్తుత వర్షాకాల సీజన్ లో అతిసార, డెంగ్యూ, మలేరియా, చికన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు సురక్షిత మార్గాలపై ప్రజలను చైతన్య పర్చడంతోపాటు, ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్, ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. ఇప్పటికీ, ఈ వ్యాధుల ఆనవాలు కన్పించిన జిల్లాల్లో మరింత అప్రమత్తతో ఉండాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో 24 / 7 పనిచేసే హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు రాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయాలన్నారు.

### ప్రస్తుత సీజన్‌లో 20.02 కోట్ల మొక్కలు నాటనున్నాం

రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ లో 20.02 కోట్ల మొక్కలు నాటెందుకు లక్ష్యంగా నిర్ణయించామని, దీనిలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే వరంగల్‌లో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో సరిపడ మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఇటీవలి కాలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాల మేరకు నాణ్యమైన మొక్కలను నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. నాటిన ప్రతీ మొక్క ను జియోటాగింగ్ చేయడంతో పాటు వాటి మనుగడకు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో 100 శాతం ఖాళీ స్థలాలు కవర్ అయ్యే విధంగా మొక్కలు నాటేందుకు జిల్లాలోని సీనియర్ అధికారులు దత్తత తీసుకోవాలని సూచించారు. ప్లాంటేషన్ సైట్లను జిల్లా అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు.

### 20 లోగా బదిలీల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి:

ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ఈనెల 20 వ తేదీ లోగా ఎట్టిపరి స్థితిలోనూ పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఇప్పటికే, శాఖల వారీగా ఖాళీల వివరాలను ప్రకటించడం జరిగిందని, సంబంధిత ఫారాలను పొందిన అనంతరం ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని తెలియచేసారు. రాష్ట్రంలో దాదాపు 49 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున, ఒక్కో పాఠశాల ఏర్పాటుకు కనీసం 20 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే సేకరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై సమీక్షిస్తూ, కేంద్ర గ్రాంటును వెంటనే పొందేందుకు గాను ఇప్పటికే పూర్తయి, ఇళ్లను పొందిన లబ్ధిదారుల వివరాలను అప్లోడ్ చేయాలన్నారు.

### రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల ఆర్థిక సహాయం

రాష్ట్రంలో రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయడం ద్వారా రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులను చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక బృందాలలో ఇప్పటికీ చేరని మహిళలందందరినీ చేర్పించాలని, రానున్న ఐదేళ్ళలో స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్య సాధనకు త్వరలోనే ఒక విధాన నిర్ణయం పత్రాన్ని విడుదల చేయనున్నట్టు సి.ఎస్ తెలిపారు. మహిళా సంఘాల ద్వారా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ ల తయారీ పనులను సకాలం లో పూర్తి చేసి ప్రశంసలు అందుకున్నారని అభినందించారు. రెండో సెట్ యూనిఫామ్ ల పనులను కూడా త్వరలోనే పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నా రు. అన్ని జిల్లాల్లో ఇందిరా క్యాంటీన్ ల ఏర్పాటు ను త్వరితగతిన ప్రారంభమయ్యేలా చొరవ చూపించాలి. ఇంకా అసంపూర్తిగా గా ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను రెండు వారాల్లో పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.




# రోడ్డు మర్మతులు తక్షణమే చెపట్టాలి

**సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం డిమాండ్**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామం నుంచి వేములకొండ స్టేజ్ వరకు ధ్వంసమైన బీటీ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని , స్టేజి నుండి ఆత్మకూరు(ఎం)వరకు డబల్ రోడ్డు వేయాలని సిపిఎం మండల కార్యదర్శి వేముల భిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. జిల్లా కమిటీ పిలుపుమేరకు పోరుబాట కార్యక్రమంలో భాగంగా పల్లెర్ల గ్రామంలో మంగళవారం రోజు పల్లెర్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో గుంతలు పడి ప్రజలకు ఇబ్బంది అవుతున్న రోడ్డును వెంటనే మ-రమ్మతులు చేపట్టాలని నూతన రోడ్డును వేయాలని నిరసన. వివిధ గ్రామాలకు సంబంధించిన అనేకమంది ప్రయాణికులు కార్మికులు విద్యార్థులు వృత్తిదారులు రైతులు ప్రయాణం చేస్తున్న పరిస్థితి ఉన్నదని రోడ్డు మొత్తం ధ్వంసమై వెళ్లడానికి ఇబ్బందులు పడుతూ అనేక ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వ అధికారులు పలుమార్లు రోడ్డు విషయంలో వారి దృష్టికి తీసుకుపోయిన గత నాలుగైదు సంవత్సరాలుగా పట్టించుకోవడంలేదని గత ఎమ్మెల్యే కూడా రోడ్డు విషయంలో పట్టించుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఈ రోడ్డు వివిధ గ్రామాల ప్రజలకు ప్రధాన రోడ్డుగా మారిందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లు మండల కమిటీ సభ్యులు రచ్చ గోవర్ధన్, గ్రామ కార్యదర్శి గుండబోయిన స్వామి, మండల కమిటీ సభ్యులు నాయిని కృష్ణారెడ్డి, నాయినిరామ్ రెడ్డి, యాదిరెడ్డి, రోషి రెడ్డి, ఎరుకల చంద్రయ్య, లోడి గోపాల్, కానుకుంట్ల నరసింహ, సంఘపాక నరసింహం, గుండబోయిన మహేష్, వట్టిపల్లి ఐలయ్య, మేడి బాబు తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**కలెక్టర్ రాహుల్ శర్మ**


**విశ్వంభర, భూపాలపల్లి :** విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జయ శంకర్ ఏకో పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్పి కిరణ్ ఖరే తో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్పి కిరణ్ ఖరే ఏకో పార్కులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా విస్తీర్ణంలో అడవి ప్రాంతం ఎక్కువగా ఉన్న జిల్లా అని ప్రభుత్వం సూచించిన విధంగా వనమహోత్సవం ద్వార జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కల నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాలలోను, అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోను, పాఠశాలల్లోను మొక్కలు నాటాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. పెద్ద మొత్తంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఇంటి ఆవరణలో కనీసం మూడు నుండి ఐదు మొక్కలు తప్పకుండా నాటాలని ఎమ్మెల్యే అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని సింగరేణి, అటవి శాఖ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ నర్సరీల ద్వారా గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వృక్షాలను మనం రక్షించినప్పుడు అవి తిరిగి మనల్ని రక్షిస్తాయని కాబట్టి పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరు కంకణ బద్ధులుగా గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను నాటాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని భూపాలపల్లి జిల్లా రాష్ట్రంలోనే పర్యావరణ సమతుల్యత కలిగిన జిల్లా అని ప్రతి కుటుంబం తమ ఇంటి ఆవరణలో ఖాళీ స్థలాల్లో కచ్చితంగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్ఓ వసంత, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, అటవి శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.






# "వన్యప్రాణులకు రక్షణ నిద్దాం... జీవ వైవిధ్యాన్ని పరిరక్షిద్దాం"

మనుషుల స్వార్థానికి అరణ్యాలను నరకడం వల్ల, అడవుల్లోనివసించే లెక్కలేనన్ని వన్యప్రాణుల మనుగడ ప్రమాదంలో పడింది. మనుషుల స్వార్థం ఫలితంగానే దాదాపు పది లక్షలకు పైగా జాతులకు చెందిన వన్యప్రాణులు అంతరించిపోయే పరిస్థితుల్లో ఉన్నాయని ఐక్యరాజ్య సమితి సహా పలు అంతర్జాతీయ సంస్థలు హెచ్చరికలు చేస్తున్నాయి. వన్యప్రాణులు ఒక్కొక్కటే అంతరించిపోతూ పోతే, చివరకు మనిషి మనుగడకే ముప్పు తప్పదని కూడా చెబుతున్నాయి. ప్రపంచంలో జీవవైవిధ్యం సజావుగా ఉంటేనే భూమ్మీద మనుషుల మనుగడ సజావుగా ఉంటుందని, జీవవైవిధ్యాన్ని కాపాడే వన్యప్రాణులు ఒక్కొక్కటే కనుమరుగైపోతుంటే, చివరకు మనిషి మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు తలెత్తుతాయని శాస్త్రవేత్తలు ప్రకటించిన కూడా మనిషి మారక పోవడం ఆందోళనకు గురిచేస్తోంది.



అంతరించిపోతున్న అడవి జాతుల సంరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు 2013 డిసెంబరు 20న జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ దాని 68వ సెషన్ యుఎన్ 68/205 తీర్మానంలో, ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవంగా ప్రకటించి చేసిన తీర్మానాలను అమలు చేయగలిగితే వన్యప్రాణి సంరక్షణ సాధ్యమవుతుంది.

పీల్చే గాలికొరకు, తినే ఆహారం కొరకు, మరెన్నో ఇతర ప్రయోజనాల కోసం మనం మొక్కలు, జంతువులపై ఆధారపడి ఉన్నాం. మనకు అవసరమైన పదార్థాలన్నీ ప్రకృతి నుంచి పొందుతున్నప్పటికిని దానివల్లసహజ వనరులను మరియు జీవవైవిధ్యాన్ని నష్టపరుస్తున్నామని గుర్తించలేక పోతున్నాము. రాబోయే దశాబ్దాల్లో అన్ని జీవ జాతులలో నాలుగింట ఒక వంతు అంతరించిపోయే ప్రమాదం ఉన్నదని ,ఇలా జీవజాతులు అంతరించిపోతే ప్రకృతిలోని జీవుల మధ్య సమతుల్యత లోపించి మిగతా జీవజాతులు కూడా అంతరించే ప్రమాదం ఉన్నదని,ఈ ప్రభావం మానవజాతిని కూడా ప్రమాదంలో పడేస్తుందనే నిజాన్ని మానవులు గుర్తించక పోవడం దురదృష్టకరం.

జనాభా పెరిగిపోవడం, అడవులు తగ్గిపోవడంతో కాలుష్యం పెరిగి వాతావరణంలో మార్పులు జరిగి జీవజాతులు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. కాబట్టి వన్యప్రాణుల సంరక్షణ చట్టాలతో వాటిని రక్షించుకోవాలని మన దేశంలో వన్యప్రాణి సంరక్షణ కోసం 1972లో చట్టం చేశారు.రాజ్యాంగం ప్రకారం పక్షులను, జంతువులను, చెట్లను సంరక్షించడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత. జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడని,లేదంటే మానవ జాతికి ప్రమాదమని,అందుకే వన్యప్రాణుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని గుర్తించాలి.

భారతదేశంలో దాదాపు 551 వన్యప్రాణుల అభయారణ్యాలు, 18 జీవ వైవిధ్య అభయారణ్యాలు, 104 నేషనల్ పార్కులు ఉన్నాయి. వన్యప్రాణులను, జీవవైవిధ్యాన్ని కాపాడటానికి ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. దేశంలోని 5.1 శాతం భూభాగాన్ని 1.65 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని మన ప్రభుత్వం వన్యప్రాణుల రక్షణ కోసం ఉపయోగిస్తోంది. ప్రపంచంలోని దాదాపు 60 శాతానికి పైగా జీవ వైవిధ్యానికి ఆశ్రయం కల్పిస్తున్న పదిహేడు దేశాలలో భారత్ ఒకటి. రకరకాల చర్యలతో ప్రకృతి సమతుల్యత గతి తప్పి వన్యప్రాణుల మనుగడకు ప్రమాదం కలుగుతోంది.

మన దేశంలో దాదాపు 132 జీవజాతులు అంతరించిపోయే పరిస్థితులకు చేరువగా ఉన్నాయని నివేదికలో హెచ్చరించింది. మన జాతీయ జంతువైన పులి మొదలుకొని చిన్న జంతువులు వరకు, రాబందులు మొదలుకొని పిచ్చుకల వరకు గల పక్షుల సంఖ్య గడచిన శతాబ్దకాలంలో గణనీయంగా తగ్గిపోయింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 87 లక్షల జీవజాతులు మనుగడ సాగిస్తున్నాయని, వీటిలో పదిలక్షల జీవజాతుల మనుగడ ముప్పులో ఉందని ఒక సర్వేలో తేలింది. 2030 నాటికి భూమ్మీద మనుగడ సాగిస్తున్న వాటిలో ప్రమాదం అంచుల్లో ఉన్న 30 శాతం జీవ జాతులను కాపాడుకోవాలని, 2050 నాటికి అంతరించిపోయే స్థితిలో ఉన్నవాటిలో 50 శాతం జీవజాతులను రక్షించుకోవాలని ధృఢ సంకల్పం అయితే ఉంది.మన దేశంలో ప్రమాదం అంచుల్లో ఉన్న జీవజాతులు మొత్తం 132 ఉన్నట్లు ఇటీవల అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి. వన్యప్రాణుల మనుగడకు తీవ్రస్థాయిలో ముప్పు తెచ్చిపెడుతున్న కారణాలు చాలానేఉన్నాయి. వీటిని నియంత్రించకుంటే మన కళ్ల ముందే చాలా జీవజాతులు అంతరించిపోయే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు కూడా వన్యప్రాణులు అంతరించిపోవడానికి కారణమవు తుంటాయి. జన్యు వైవిధ్యం కారణంగా కొన్ని ప్రాణులు, ఆహారం కొరవడటం వల్ల మరికొన్ని జీవ జాతులు నశిస్తున్నాయి.

ప్రపంచ మానవాళి ఉనికికే ప్రధాన కారణమైన వన్యప్రాణులను కాపాడుతూ, మానవ శ్రేయస్సుకు పునాదులు వేసుకుందాం.అరుదైన జీవులను అంతరించకుండా కాపాడుకోవడం, వాటి పెరుగుదలకు చేయూత ఇవ్వడం, వన్యప్రాణం పరిరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయడం, వన్యప్రాణుల ప్రాధాన్యతలను వివరించడం లాంటి చర్యలు చేపట్టడం వల్ల కొంతైనా ప్రయోజనం ఉండవచ్చు.ఇప్పటికైన మనిషి వన్యప్రాణుల పట్ల అవగాహన కలిగి వాటి జీవన విధానాన్ని కొనసాగించేలా ప్రవర్తించాలని కోరుకుందాం.



-గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282
raghupatiraog@gmail.com




# సమైక్య సర్ప సంచారం తెలంగాణ సమాజం కలవరం

సర్ప సంచారం... మన ఇంట్లో ఒక పాము దూరిందనుకోండి. ఎం జరుగుతుంది. దానిని బయటకు పంపే వరకు లేదా దానిని చంపే వరకు ఇంటిల్లాదులకు నిద్ర పట్టదు. పోనీ, పామే కదా... అటవీ జంతువులని నిర్లక్ష్యం చేస్తే అది మనను మన కుటుంబ సభ్యులను కరిచి మట్టు బెట్టుతుంది. సరిగ్గా ఇదే పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడింది. ప్రపంచ ఉద్యమాల చరిత్రలో మకుటమయంగా భావించే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ద్వారా నాలుగున్నర కోట్ల మంది ఆకాంక్షగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. దీనితో, తమ వ్యాపార దోపిడీకి అడ్డుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వంపై నిరంతరం కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూనే ఉన్నారు తెలంగాణ వ్యతిరేకులు. దీనిలో భాగంగానే, ఓటుకు నోటు, చేవెళ్ల ఫామ్ హౌస్ కుట్ర, ఖమ్మం జిల్లాలో నాలుగు మండలాలకు ఏకపక్షంగా ఆంధ్రాలో కలుపుకోవడం లాంటి అనేక ప్రత్యక్ష కుట్రలకు పాల్పడుతూనే వచ్చారు. అయినప్పటికీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాపాడేందుకై ఉన్న కేసీఆర్ వీరి ఆటలను ఏమాత్రం సాగకుండా ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేస్తూనే ఉన్నాడు. ఇక లాభం లేదని, సోషల్ మీడియా, సమైక్య మీడియా విషనాగులను అడ్డుపెట్టుకొని గత ఏడెన్లలో తెలంగాణలో సాధించిన అద్భుత విజయాలను మరుగున పడేస్తూ కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులపై ఒక పద్ధతి ప్రకారం విషం చిమ్ముతూనే ఉన్నారు. జవాబుదారీ లేని తనంతో కొందరు జర్నలిస్టులుగా చెప్పుకునే వారు సోషల్ మీడియా ముసుగులో విపరీత దుష్ప్రచారానికి పాల్పడడం దానిని అమాయక ప్రజలు నమ్మడం, బంగారు బాతు లాంటి తెలంగాణ ఆత్మ కలిగిన ప్రభుత్వాన్ని దూరం చేసుకోవడం జరిగిన పరిణామాలు.


ఎవరిపైనైతే, సుదీర్ఘ పోరాటం జరిపి తెలంగాణను విముక్తం చేసామో, గత దశాబ్ద కాలంగా తెలంగాణలో అడుగు పెట్టాలంటేనే జంకిన చంద్రబాబు అండ్ కోలు తిరిగి ఆ విద్రోహ స్వభావులు ఈనెల 5వ తేదీన హైదారాబాద్‌లో అడుగు పెట్టడం వారికి సమైక్య ముసుగులోని రియల్ ఎస్టేట్, భూ కబ్జా దారులు, ఇక్కడి ప్రజలను, సహజ వనరులను దోచుకొని పక్క రాష్ట్రానికి తరలించే ముఠాలు సదరు ఆ నాయకుడికి ఘన స్వాగతం పలికాయి. దీనికి ఇక్కడి ఆంధ్రా మీడియా పతాక శీర్షికలతో వార్తలు ప్రచురించడం, దేశానికి ఓ గొప్ప విజనరీ, ఐటీరంగానికి ఆద్యుడు, పరిపాలనాధికారి అంటూ లేని పోనీ హైప్ క్రేయేట్ చేయడంతో ఇక్కడి అమాయక జనం ఈ తప్పుడు ప్రచారానికి లోనయ్యారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక, విభజన హామీల పరిష్కారంపేరుతో ఈ ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగినప్పటికీ,ఏ అంశంపై ఏకాభిప్రాయం రాలేదని, మరి కొన్ని సార్లు ఈ సమావేశాలు కొనసాగుతాయని ప్రకటించడం, పరోక్షంగా తెలంగాణపై పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి పెత్తనం ప్రారంభమైనట్టేనని చెప్పక తప్పదు. ఇప్పటికే, గత ప్రభుత్వ హయాంలో ప్రారంభ మైన రీజినల్ రింగ్ రోడ్ పరిధిలో పెద్ద ఎత్తున భూములను కొనుగోలు చేయడానికి ఆంధ్రా పెట్టుబడి దారులు రంగంలోకి దూకారు. హైటెక్ సిటీ, కూకట్పల్లి, ఫైనాన్షియల్ సిటీ తదితర ఐటీ ప్రాంతాల్లో దాదాపు 60 శాతం భూములు ఆంధ్రా రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబంద హస్తాల్లో ఉన్నాయి. దీనికి ప్రత్యక్ష నిదర్శనం అయ్యప్ప సొసైటీని అని చెప్పవచ్చు. పాలనలోనూ ఆంధ్ర అనుకూల అధికారులను నియమించుకోవడం కూడా ప్రారంభమైంది. గత దశాబ్ద కాలంగా స్తబ్దంగా ఉన్న ఆంధ్ర గుత్తేదారులు, బ్రోకర్లు హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రతీ రోజూ దర్శనమిస్తున్నారు. ప్రస్తుతం, తెలంగాణ మంత్రులలో కార్యాలయాల్లో దాదాపు 50 శాతం మంది ఆంధ్రా ఉద్యోగులే ఉన్నారని దీనితో తిరిగి ఏదైతే వద్దని ఉద్యమం చేసామో తిరిగి ఆ ప్రాంత ఉద్యోగులే పెత్తనం చెలాయిస్తున్నారని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు ఒకరు అభిప్రాయం పడ్డారు.

విభజన హామీలతో తెలంగాణలో అడుగు పెట్టిన చంద్రబాబునాయుడి పర్యటనను స్వాగతం చేస్తూ, తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న వామ పక్ష పార్టీల నాయకులు కూడా స్వాగతం పలకడం, ప్రధానంగా కమ్మటి నాయకులైన సీపీఐ నారాయణ, తమ్మినేని వీరభద్రం లాంటి వారు మరోసారి చంద్రబాబు నాయుడిని ఆకాశానికి ఎత్తెయ్యడాన్ని కూడా తెలంగాణ సమాజం గమనిస్తోంది.

ఈమొత్తం ఎపిసోడ్‌లో, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున అధికార పార్టీలోకి వలసలు జరుగుతున్నా.. తెలంగాణ ప్రజలు పెద్దగా పట్టించుకోవడంలేదు. గత వేసవిలోనూ, యాసంగి పంటకు నీళ్లివ్వకుండా కాళేశ్వరాని ఎండబెట్టడం, 24 గంటలు కరెంటుతో ఉన్న రాష్ట్రాన్ని కరెంటు కోతలతో తిరిగి పాత రోజులను ప్రవేశపెట్టడం, రెండు లక్షల ఉద్యోగాలపై నిశ్శబ్దం పాటించడం, సామాజిక పింఛనులను పెంచకుండా కనీసం పాత పింఛనులను కూడా సకాలంలో పంపిణీ చేయని ప్రభుత్వ అసమర్థ చేష్టలను తెలంగాణ సమాజం నిశ్శబ్దంగా గమనిస్తూనేఉంది. ఈ క్రమంలో తెలంగాణ వాదంపై గెలిచిన ప్రజాప్రతినిధులు అధికార పక్షానికి వలస వెళ్తున్నా ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు.

ఈ పరిస్థితిలో, ఎవరిపైనా ఉవ్వెత్తున ఉద్యమం వచ్చిందో, ఎవరైతే తెలంగాణ సంపదను నిలువునా దోచుకున్నారో, ఏవైతే అక్రమంగా తెలంగాణ సచివాలయంతో సహా ఉన్నత స్థాయి ఉద్యోగాలలో అడ్డదారిగా వచ్చారో, తిరిగి వారందరూ చంద్రబాబు నాయుడి ముసుగులో విభజన హామీల చర్చల పేరుతో హైదరాబాద్‌లో అడుగుపెట్టడాన్ని, తెలంగాణ ప్రజల మనస్సులను తొలచివేస్తోంది. దీంతో , మరోసారి ఉద్యమానికి బీజాలు పడుతున్నాయని చెప్పక తప్పదు.



- డాక్టర్ కాచం సత్యనారాయణ
వీ3 న్యూస్ చైర్మన్,
సీఎండీ విశ్వంభర తెలుగు దిన పత్రిక

# స్వామినాథన్ కమీషన్ సిఫారసులు కనీస మద్దతు ధరలు అమలు ఎప్పుడు?



వ్యవసాయ రంగం అభివృద్ధిలో సరైన ధరల విధానం, సాగు రంగం ఆధునీకరణ, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ప్రోత్సాహకరంగా ఉండాలి. పంటలకు మద్దతు ధరలు అధికంగా వున్నప్పుడు రైతులు అధికంగా ఉత్పత్తి చెయ్యడానికి సిద్ధపడుతారు. రైతులకు అండగా నిలిచేందుకు కేంద్రం కనీస మద్దతు ధర ప్రకటిస్తుంది. గత సంవత్సరంతో పోల్చుకుంటే క్వింటా వరికి కనీస మద్దతు ధర రూ.117/ పెరిగింది. పప్పు ధాన్యాల దిగుమతులను తగ్గించాలనే లక్ష్యంతో క్వింటా కందులను రూ.550/ పెంచింది. వాస్తవ పంట సాగు ఖర్చులతో పోలిస్తే ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు అరకొరేనని రైతులు వాపోతున్నారు. భూమి విలువ కౌలు ధర సహా అన్ని రకాల వాస్తవిక పంటల ఉత్పత్తి వ్యయాలన్ని గణించి 50% అధనంగా గిట్టుబాటు ధర కల్పించాలని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ తన నివేదికలో కొన్ని దశబ్దాల క్రితమే కేంద్ర ప్రభుత్వాలకు సిఫారసు చేశారు. దశాబ్దాలు గడుస్తున్న స్వామినాథన్ కమీషన్ సిఫారసులు మన దేశ వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయనందున రైతులు తక్కువ ధరలకే పంటలు అమ్ముకోవలసి వస్తున్నందున రైతుల నికర ఆదాయాలు భారీగా తగ్గి అప్పులు పాలై ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నీతి అయోగ్ మాత్రం కనీస మద్దతు ధరలు నిర్ణయిస్తున్నప్పుడు, భూమి విలువ, కౌలు వ్యయాన్ని పరిగణనలోనికి తీసుకోవడానికి నిరాకరించడం రైతు కష్టాన్ని విస్మరించడమే. ఇటీవల కాలంలో డిజిల్, విద్యుత్, ఎరువులు, సాగు ఖర్చుల ధరలు విస్తృతంగా పెరిగాయి. సరైన ధర రాక దేశంలో కొన్నిచోట్ల క్రాప్ హాలిడే కూడా ప్రకటిస్తున్నారు. సాగు సంక్షోభం వలన చాలా మంది అన్నదాతలు వ్యవసాయాన్ని వదిలిపెట్టి పట్టణాలకు, నగరాలకు వలస వెళ్ళి అక్కడ దయనీయంగా జీవితాలు వెళ్ళదీస్తున్నారు.

వాస్తవ సాగు ఖర్చును దృష్టిలో పెట్టుకొని కనీస మద్దతు ధరలు ప్రకటించడం వలన ఇటు రైతులకు అటు సమాజానికి ఎన్నో లాభాలు చేకూరుతాయి. ప్రస్తుతం దేశంలో పప్పు ధాన్యాల సాగు తగ్గి పెద్ద మొత్తంలో విదేశాల నుంచి వాటిని దిగుమతి చేసుకోవలసి వస్తుంది. దానితో పప్పు ధాన్యాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పప్పు ధాన్యాలకు, నూనె గింజలకు సరైన మద్దతు ధరలు ప్రకటించడం వల్ల భారతదేశంలో పప్పు ధాన్యాల, నూనె గింజల సాగును ప్రోత్సహించవచ్చు. మన దేశంలో కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమీషన్ సిఫారసులకనుగుణంగా మద్దతు ధరలను పెంచనట్లయితే, ప్రతి సంవత్సరం పెరిగే వ్యవసాయ ఉత్పత్తి వ్యయాల ముడి పదార్థాల వ్యయాల ధరలు పరిగణనలోనికి తీసుకొని అన్ని పంట ధరల మద్దతు ధరలను పెంచనట్లయితే రానున్న 5, 10 సంవత్సరాల్లో తీవ్రమైన సాగు సంక్షోభం ఏర్పడి దేశ ప్రజల ఆహార భద్రతకు ముప్పు వాటిల్లగలదు మన దేశంలో 60 శాతం ప్రజలు ప్రత్యక్షంగా పరోక్షంగా వ్యవసాయ రంగం పైన ఆధారపడుతున్నారు. కానీ 60 శాతం ప్రజలు వ్యవసాయ రంగం నుంచి మన స్థూల జాతీయ ఆదాయంలో సుమారు 18 శాతం ఆదాయం మాత్రమే పొందుతున్నాము. స్థూలంగా ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయం రెట్టింపు కావాలి.

దేశంలో జనాభా 60 శాతంగా వున్నా రైతుల ఆదాయాలు కొనుగోలు, శక్తి పెరిగినట్లయితే వస్తు సేవలకు డిమాండ్ పెరిగి పారిశ్రామిక సేవా రంగాలు వృద్ధి చెందును. తద్వార అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగి తద్వారా జాతీయ ఉత్పత్తి సేవలు పెరిగి తదనుగుణంగా జి.డి.పి. అధికంగా పెరగగలదు. చివరగా మన స్థూల జాతీయ ఉత్పత్తి అధికంగా పెరిగినట్లయితే మన దేశం ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగానే కాకుండా అభివృద్ధి చెంది దేశంగా వద్ధి చెంది అమెరికా చైనా సరసన నిలబడగలదు.





- కోట విద్యాసాగర్ రెడ్డి
సీనియర్ న్యాయవాది,
సామాజిక రచయిత
9849926508

# తీపు కబురు చెబుతున్న తెలంగాణ ప్రభుత్వం

## పింఛన్లు పెంచుతామని ప్రకటన




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు అడుగులు వేస్తోంది. పింఛన్ల పెంపునకు చర్యలు తీసుకుంటోంది. ఇక మీదట ఆసరా, బీడీ, ఒంటరి, దివ్యాంగుల పింఛన్లు పెంచి ఇస్తామని చెబుతోంది. ఈ మేరకు మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటోంది. పింఛన్ల పెంపును బాధ్యతాయుతంగా భావిస్తోంది. ఇచ్చిన మాటకు కట్టుబడి నడుచుకుంటామని చెబుతున్నారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తుందా? అని ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. తాజాగా వీటికి సంబంధించి రాష్ట్ర మంత్రి సీతక్క కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా పింఛన్ల కోసం అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించింది. వీటితోపాటు గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న పింఛన్ల దరఖాస్తులపై నివేదిక సమర్పించాలన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే చేయూత పథకం కింద పింఛన్లను పెంచబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం స్టోన్ కట్టర్లు, చేనేత, ఫైలేరియా రోగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, డయాలసిస్ రోగులు, ఎయిడ్స్ రోగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు పింఛన్లు అందజేస్తున్నారు. ఆసరా కింద రూ.2016, దివ్యాంగులకు రూ.3016 ఇవ్వనుండగా చేయూత కింద దివ్యాంగులకు రూ.6వేలు, ఇతరులకు రూ.4వేలు అందించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది.

**ఎవరు అర్హులంటే..**

దరఖాస్తుదారులు తెలంగాణకు చెందివుండాలి. ఆర్థికంగా వెనకబడిన కుటుంబానికి చెందిన వారై ఉండాలి. స్టోన్ కట్టర్లు, చేనేత, ఫైలేరియా రోగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, డయాలసిస్ రోగులు, ఎయిడ్స్ రోగులు, గీత కార్మికులు, బీడీ కార్మికుల్లో ఏదైనా ఒక వర్గానికి చెందిన వారై ఉండాలి. దీనికి సంబంధించిన పూర్తి పత్రాలు ఉండాలి. ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, (వయసు కోసం) వైద్యుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బ్యాంక్ ఖాతా.

# కానిస్టేబుల్ అభ్యర్థులకు గుడ్ న్యూస్

## ట్రైనింగ్ కు హాజరు కాని వారికి మరో ఛాన్స్




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో కానిస్టేబుల్ శిక్షణకు ఎంపికై అనివార్య కారణాల వల్ల హాజరుకాలేక పోయిన 130 మంది అభ్యర్థులకు పోలీసు శాఖ శుభవార్త తెలిపింది. అభ్యర్థులకు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు అదనపు డీజీ (ట్రైనింగ్) అభిలాష బిస్త్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి జులై 22 నుంచి శిక్షణ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు నియామక మండలి సివిల్, ఏఆర్, రాష్ట్ర విభాగాలలో ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థులకు గత ఫిబ్రవరిలో శిక్షణ ప్రారంభించారు. అయితే కొంతమంది అభ్యర్థులు పలు టెక్నికల్ కారణాల వల్ల శిక్షణకు హాజరుకాలేకపోయారు. అయితే జులై 22 నుంచి వీరికి శిక్షణ ప్రారంభంకానుంది. మొత్తం 9 నెలలు పాటు శిక్షణ కొనసాగనుంది. శిక్షణకు ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లను ఆమె కోరారు.

### ఫిబ్రవరిలో ట్రైనింగ్ ప్రారంభం

తెలంగాణలో మొత్తం 16,604 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 2022 ఏప్రిల్‌లో నోటిఫికేషన్ జారీ కాగా.. 15,750 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో 5,010 పోస్టులు టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి. తెలంగాణలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు గత ఫిబ్రవరి 21 నుంచి శిక్షణ ప్రారంభమైన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 28 కేంద్రాల్లో శిక్షణ నిర్వహించారు. హైదరాబాద్‌లోని రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీతో పాటు టీఎస్ఎస్‌పీ బెటాలియన్లు, పోలీస్ శిక్షణ కళాశాలలు, జిల్లా శిక్షణ కేంద్రాలు, నగర శిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు. సివిల్, ఏఆర్, ఎస్ఏఆర్ సీపీఎల్, టీఎస్ఎస్‌పీ విభాగాలకు సంబంధించి మొత్తం 13,444 మంది కానిస్టేబుళ్లను ఎంపిక చేశారు. అయితే రాష్ట్రంలోని శిక్షణ కేంద్రాల్లో 11 వేల మందికి సరిపడా వసతులు మాత్రమే ఉన్నాయి. దీంతో టీఎస్ఎస్‌పీ విభాగానికి చెందిన 5,010 మందికి కానిస్టేబుళ్లకు తాత్కాలికంగా వాయిదా వేసి, మిగిలిన వారికి శిక్షణ ప్రారంభించారు. ఆ తర్వాత వారికి శిక్షణ కొనసాగించారు. తాజాగా మిగిలిన వారికి శిక్షణకు సంబంధించిన పోలీసు నియామక బోర్డు కీలక ప్రకటన చేసింది. వివిధ కారణాలతో హాజరుకాని 130 మందికి రాష్ట్ర పోలీస్ అకాడమీ ఆహ్వానం పంపింది. వీరంతా ఈ నెల 22లోపు ఆయా శిక్షణ కేంద్రాల్లో రిపోర్టు చేయాలని కోరింది.

### గతేడాది కానిస్టేబుల్ మెయిన్ ఫలితాలు

తెలంగాణలో కానిస్టేబుల్ మెయిన్ పరీక్షల ఫలితాలు గతేడాది మే 30న వెలువడిన సంగతి తెలిసిందే. తుది రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నేపథ్యం, నేరచరిత్ర గురించి ఆరా తీసి ఎంపికైన వారి తుది జాబితాను పోలీసు శాఖ వెల్లడించింది. తుది ఫలితాలకు సంబంధించి ఎస్‌సీటీ పోలీసు కానిస్టేబుల్ సివిల్, ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు 98,218బీ ఎస్‌సీటీ ఎస్ఐ సివిల్ పోస్టులకు 43,708బీ ఎస్‌సీటీ పోలీసు కానిస్టేబుల్ ఐటీ అండ్ సీవో ఉద్యోగాలకు 4,564బీ ఎస్‌సీటీ ఎస్ఐ ఐటీ అండ్ సీవో పోస్టులకు 729, ఎస్‌సీటీ పోలీసు కానిస్టేబుల్ డ్రైవర్, డ్రైవర్ ఆపరేటర్ ఉద్యోగాలకు 1,779బీ ఎస్‌సీటీ ఏఎస్ఐ ఎఫ్‌పీబీ ఉద్యోగాలకు 1,153బీ ఎస్‌సీటీ ఎస్ఐ పీటీవో ఉద్యోగాలకు 463, ఎస్‌సీటీ పీసీ మెకానిక్ పోస్టులకు 238 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వీరి నుంచి 13,444 మంది కానిస్టేబుల్ శిక్షణకు పోలీసుశాఖ ఎంపిక చేసింది.

# అధికారుల తీరుపై మంత్రి పొన్నం ఆగ్రహం

## ప్రొటోకాల్ పాటించడం లేదని రోడ్డుపై బైఠాయింపు



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ప్రస్తుతం బోనాల జాతర సమయం. దీంతో నగరమంతా బోనాలతో నిండి పోతోంది. ఎటు చూసినా బోనాలే దర్శనమిస్తున్నాయి. ప్రజల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాల్లో లోటుపాట్లు ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోనాల నిర్వహణపై విచారం వ్యక్తం చేశారు. అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చారిత్రాత్మక బోనాల పండగ హైదరాబాద్‌లో రంగరంగ వైభవంగా ఆరంభమైంది. గోల్కొండ బోనాల జాతరతో ఈ నెలన్నర రోజుల వేడుకలకు శ్రీకారం చుట్టారు. గోల్కొండలో వెలిసిన జగదంబికా అమ్మవారికి తొలి బోనం సమర్పించారు భక్తులు. అమ్మవారికి తొట్టెలు, ఫలహార బండ్లు, రంగం, బలిగంప ఊరేగింపు వంటి కార్యక్రమాలతో జంటనగరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ నెల 14వ తేదీన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించనున్నారు. 21న పాతబస్తీ లాల్ దర్వాజా సింహ వాహిని అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పిస్తారు. దీనికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇదివరకే 20 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. తాజాగా బల్కంపేట్‌లో వెలిసిన ఎల్లమ్మ అమ్మవారికి బోనాలను సమర్పిస్తోన్నారు భక్తులు. ఈ తెల్లవారుజాము నుంచే ఆలయం వద్ద భక్తుల తాకిడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాదిమంది బారులు తీరారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరింపజేశారు. ఈ ఉదయం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బోనం ఎత్తారు. ఎల్లమ్మ అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. సుమారు 40 నిమిషాల పాటు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ మంత్రిత్వ శాఖ అధికారులు, కొందరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇందులో పాల్గొన్నారు. అధికారులు, ఆలయ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ- తోపులాట మాత్రం తప్పలేదు. అమ్మవారికి కల్యాణోత్సవాన్ని వీక్షించడానికి భక్తులు ఎగబడ్డారు. ఫలితంగా క్యూలైన్లల్లో స్వల్పంగా తోపులాట సంభవించింది. ఈ ఘటనలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కిందపడ్డారు. దీనితో వారు ఆలయం ఎదురుగా రోడ్డు డివైడర్‌పై బైఠాయించారు. అధికారుల తీరుపై ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించట్లేదంటూ మండిపడ్డారు. అప్పటికప్పుడు పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఫోన్ చేశారు. ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాహుల్ గాంధీది ఆస్కార్ లెవల్ నటన

- కేటీఆర్ సెటైర్లు
- తమ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై ఆగ్రహం




**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎమ్మెల్యేల కొనుగోలుపై రాహుల్‌గాంధీ ద్వంద్వ వైఖరి అవలంభిన్నారని ఆయన విమర్శించారు. ఒకవైపు కర్ణాటకలో, గోవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల కొనుగోలుపై బీజేపీని తప్పుపడుతున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్.. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తుంటే ఎందుకు సమర్థిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ కపటత్వాన్ని బయటపెట్టడం ద్వారా ఆ పార్టీపై ఒత్తిడి తెస్తామని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ ఆస్కార్ లెవల్‌లో నటిస్తున్నాడని, 'నాటు-నాటు' పాట తర్వాత రాహుల్‌గాంధీకే ఆస్కార్ అవార్డు దక్కాలని ఆయన ఎద్దేవా చేశారు. తనను తాను ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేదిగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ.. తమ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరినప్పుడు బాధిత కార్డును ప్లే చేస్తోందని, కానీ బీజేపీ చేసిన పనే ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. 'నేను కాంగ్రెస్ నాయకత్వాన్ని, ఏఐసీసీని ఒక విషయం అడగాలనుకుంటున్నా. మీకు ఏదైనా జరిగితే దాన్ని అన్యా యం అంటారు. అలాంటప్పుడు మీరు అదే అన్యాయం చేసి ఎలా సమర్థిం చుకుంటారు..?' అని కేటీఆర్ ప్రశ్నించారు. 'ఒక వైపు మీరు రాజ్యాంగం గొప్పతనం గురించి మాట్లాతారు. మరోవైపు అదే రాజ్యాంగాన్ని అవమానిస్తారు. మీరు చెప్పేది మీరే ఆచరించకపోతే ఎలా..?' అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీని తాము ఎట్టి పరిస్థితుల్లో విడిచి పెట్టేది లేదని కేటీఆర్ శపథం చేశారు. కాంగ్రెస్ పార్టీ బండారాన్ని ఢిల్లీలో బట్టబయలు చేస్తామని చెప్పారు. న్యాయం కోసం ఢిల్లీలో అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలను కలుస్తామన్నారు. రేవంత్‌రెడ్డి తన ప్రభుత్వాన్ని పూర్తి కాలం నడపాలని, ముఖ్యంగా ఆయన పరిపాలనపైనే దృష్టి పెట్టాలని తాము కోరుకుంటున్నామని అన్నారు. 2004లో తాము కాంగ్రెస్‌తో కలిస్తే మా పార్టీని చీల్చేశారని, మళ్లీ అలాంటి తప్పును రిపీట్ కానీయదల్చుకోలేదని చెప్పారు.



# రైతు కోసం చొరవ చూపిన ఏపీ మంత్రి

## క్షణాల్లో విద్యుత్ సమస్య పరిష్కారం

**విశ్వంభర, కడప:** రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా. మంత్రి అనుకుంటే కానిది ఏదైనా ఉంటుందా. తాజాగా ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో ఓ రైతు విద్యుత్ తీగల సమస్యను క్షణాల్లో పరిష్కరించారు. అధికారులను పరుగులు పెట్టించి ఆ పని కానిచ్చాడు. సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయంతో మంత్రి అధికారులను పురమాయించి రైతు కష్టం తీర్చాడు. దీంతో అందరు సంతోషిస్తున్నారు. మంత్రి తీరుకు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ఇలాంటి వారు కావాలని అంటున్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎంత చేసినా తక్కువే. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొనే సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడం అధికారుల వల్ల కావడం లేదు. పైకి ఎన్ని మాటలు చెప్పినా రైతుల అసలు సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు పడటం లేదు. ఇదే క్రమంలో రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తన దృష్టికి వచ్చిన ఓ రైతు సమస్యను చూసి చలించిన ఆయన కేవలం 3 గంటల్లోనే పరిష్కారం చూపించారు. ఈ ఘటన కడప జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లా ఖాజీపేట నాగసాని పల్లెలో అబ్బయ్య అనే రైతు పొలం పై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు గాలికి కిందకు వంగిపోయి నేలను తాకుతుండేవి. దీంతో రైతు అబ్బయ్య తన సొంత పొలంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అలాగని వ్యవసాయం చేయకుండా ఉండటం కష్టం. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్న ఆయన.. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. తాజాగా వర్షాలు కురుస్తుండటంతో దుక్కిదున్నుకునేందుకు మరోసారి రైతు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో తన పొలానికి అడ్డుగా ఉన్న కరెంటు తీగల్ని కుటుంబ సభ్యుల సాయంతో పైకి ఎత్తి పట్టుకునేలా చేసి నారుమళ్లు వేస్తున్నాడు. స్థానికులు ఈ ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఇది కాస్తా వైరల్ కావడంతో ఏపీ విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టిలో పడింది. రైతు అవస్థ చూసి చలించిన విద్యుత్ మంత్రి.. వెంటనే అధికారుల్ని పిలిపించి మాట్లాడారు. తక్షణం వివరాలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల్ని పరుగులుపెట్టించడమే కాకుండా కేవలం 3 గంటల్లోనే సమస్య రిష్కరించారు. అప్పటివరకూ నిర్లక్ష్యంగా ఉండిపోయిన అధికారులు కాస్తా మంత్రి ఆదేశాలతో పరుగులు తీశారు.

రైతు అబ్బయ్య పొలంలో నేలను తాకుతున్న విద్యుత్ తీగల్ని పక్కనే స్తంభం ఏర్పాటు చేసి పైకి ఎక్కించారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యను మంత్రి కేవలం 3 గంటల వ్యవధిలోనే పరిష్కరించడంతో రైతు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చొరవతో రైతు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



# జగన్ ఎంపీగా పోటీ చేస్తారా..? క్లారిటీ ఇదే..

**విశ్వంభర, అమరావతి :** ఏపీ ఎన్నికల్లో ఘోర పరాజయం చెందడంతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పులివెందుల ఎమ్మెల్యేగా రాజీనామా చేసి, కడప ఎంపీగా పోటీ చేయాలని భావిస్తున్నట్లుగా సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఊతమిచ్చారు. నిన్న వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన.. కడప ఉప ఎన్నిక జరిగితే షర్మిల తరఫున క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తానంటూ వెల్లడించారు. దీంతో జగన్ ఎంపీగా వెళ్లడం ఫిక్సయిపోయిందని అంతా భావిస్తున్నారు. పులివెందుల ఎమ్మెల్యే స్థానానికి జగన్ రాజీనామా చేస్తే అక్కడ జగన్‌కు బదులు తన తల్లి విజయమ్మ లేదా సతీమణి వైఎస్ భారతిలను రంగంలోకి దింపుతారని కూడా వార్తలు వస్తున్నాయి. ఎంపీగా ఉంటే తనపై ఉన్న అక్రమాస్తుల కేసులను మేనేజ్ చేసుకునేందుకు ఈజీగా ఉంటుందనే ఉద్దేశంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఎంపీగా ఢిల్లీకి వెళ్తే కేంద్ర రాజకీయాల్లో కూడా కీలకం కావచ్చని జగన్ అనుకుంటున్నట్లుగా ఒక వాదన ఉంది. అయితే, గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితమైన నేపథ్యంలో విపక్ష హోదా దక్కకపోవడంతో ఐదేళ్లు కూటమిని ఎదుర్కోలేక జగన్ ఈ నిర్ణయానికి వచ్చారని ప్రచారం జరుగుతోంది.

### రేవంత్‌రెడ్డికి కడప జిల్లా అధ్యక్షుడి కౌంటర్

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై వైసీపీ కడప జిల్లా అధ్యక్షుడు సురేశ్ బాబు మండిపడ్డారు. ఇలాంటి దుష్ప్రచారం చేయడం దారుణమని విమర్శించారు. 2011లో జరిగిన కడప ఉప ఎన్నికల్లో కడప దెబ్బ.. ఢిల్లీ అబ్బా అనేలా ప్రజలు తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. అప్పుడు వైఎస్ జగన్‌కు వచ్చిన మెజార్టీ చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇప్పుడు ఏదో కడప ఉప ఎన్నిక అంటూ రూమర్స్ రాగానే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.



## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### డీఎస్సీ పరీక్షను వాయిదా వెయ్యాలి

**విశ్వంభర, చివ్వేంల :** కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలు పేరుతో రైతులను మరియు నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు శిగ వీరస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కోడి బండ్లయ్య విమర్శించారు. చందుపట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ రైతులకు సకాలంలో రైతుబంధు ఇచ్చి రైతులకు కావలసినటువంటి ఎరువులను అందుబాటులో ఉంచి మరియు పెట్టుబడి సహాయంగా రైతు బందు వారికి ఉపయోగపడేదని అన్నారు. ఈ ప్రభుత్వంలో రైతు బంధు ని ఎకరానికి 15000 ఇస్తాం అని చెప్పి ఇవ్వలేదు ఇవ్వకుండా ఆ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ రైతులను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చినటువంటి వాగ్దానాన్ని నెరవేర్చి రైతులకు సహాయం చేయవలసిందిగా టిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందంటే దానిలో నిరుద్యోగుల పాత్ర చాలా ఉందని ఈ రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలి.

డీఎస్సీ వాయిదా వేయాలని రాష్ట్రంలోనే ప్రతి ఒక్క నిరుద్యోగి కోరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బండ్లయ్య, గుద్దేటి వెంకన్న, కోడి రవి, ఆంజనేయులు, శీను నాగరాజు, సిగ మదర్, తదితరులు పాల్గొన్నారు.



## గతంలో నాటిన మొక్కలు మణిహారంగా మారాయి

### ఎమ్మెల్యే గాంధీ

**విశ్వంభర, కూకట్‌పల్లి :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివేకానంద నగర్ కాలనీలోని వినాయక నగర్ పార్కులో శేర్లింగంపల్లి శాసనసభ్యులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాధవరం రోజాదేవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగం కావడం సంతోషకరంగా ఉందని, రోడ్డుకు ఇరువైపులా, కాలనీలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కాలనీ వాసులకు సూచించారు. గత ప్రభుత్వంలో నాటినన్ మొక్కలు ప్రస్తుతం రాష్ట్రానికి మణిహారంగా మారాయి అన్నారు. కార్యక్రమంలో అధికారులు మేనేజర్ రఘువీర్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, సంజీవ రెడ్డి, గొట్టిము క్కల పెద్ద భాస్కర్ రావు, మాచర్ల భద్రయ్య, రాంచందర్, ఆంజనేయులు, చంద్రమోహన్ సాగర్, సత్యనారాయణ, రవి, జగదీష్, ఆనంద్ పాల్గొన్నారు.

## తిమ్మాపూరంలో ఉపాధి హామీ పనుల పరిశీలన



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపూరం గ్రామంలో మంగళవారం రోజు ఎంపీడీఓ ఎండీ నిరంజన్ వలీ ఎంపీఓ జులూరు పద్మావతి శానిటేషన్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమం వరకు గుంతలు తీసి మొక్కలు నాటటానికి సిద్ధం చేయాలని అన్నారు. గుంతలను ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన కోలతల ప్రకారం తీసి 300 రూపాయల వేతనం తీసుకోవాలని కూలీలకు సూచించారు. వీరివెంటా పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధి హామీ ఏఫ్ఏ రవిందర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

## మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు

### కాంగ్రెసు పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూర్ మండలం కాంగ్రెసు పార్టీ మోటాకొండూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్ సోమవారం రోజు ములుగు జిల్లా కేంద్రంలో పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి తెలంగాణ ఉక్కు మహిళ పీడిత ప్రజల ఆశా జ్యోతి టైగర్ దానసరి సీతక్కని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు మండల కాంగ్రెసు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల నిర్మాణానికి పూర్తి సహకారం

- ఆర్ఆర్ఆర్‌కు సహకరించాలి
- ఎన్‌హెచ్ఏఐ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రహదారుల నిర్మాణానికి ఏవైనా ఆటంకాలు ఉంటే వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏ) ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆయన నివాసంలో మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్ట్స్ మెంబర్ అనిల్ చౌదరి,హెూఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన , సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్‌హెచ్ ఏఐ చేపడుతున్న రహదారుల నిర్మాణంలో భూ సేకరణతో పాటు తలెత్తున్న పలు ఇబ్బందులను అధికారులు ముఖ్యమంత్రి కి వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి ఆయా సమస్యల పరిష్కారానికి బుధవారం సచివాలయం లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రహదారులు నిర్మాణం జరిగే జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు భేటీలో పాల్గొంటారని, ఆయా సమస్యలపై చర్చించి అక్కడే సమస్యలను పరిష్కరించుకుందామని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

### ఆ పనులు మొదలుపెట్టండి..

హైదరాబాద్, మన్నెగూడ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు. కాంట్రాక్టు సంస్థతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే మొదలు పెట్టాలనిహెూరికి సూచించారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు కోసం ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలను ముఖ్యమంత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎన్‌హెచ్ఏఐ అధికారులను కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారత్ మాల పథకంలో ఆర్ఆర్ఆర్ ను చేపట్టాలని ప్రధానమంత్రి మోదీకి ఇటీవల విజ్ఞప్తి చేసిన విషయాన్ని వారికి గుర్తు చేశారు. ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్యలో 12 రేడియల్ రోడ్లు వస్తాయని సీఎం తెలిపారు. వాటి మధ్య పలు క్లస్టర్లు, శాటిలైట్ టౌన్ షిప్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణకు తీర ప్రాంతం లేనందున డ్రైపోర్ట్ ఏర్పాటు చేయనున్నామని, ఇందుకోసం బందర్ పోర్టును అనుసం ధానించేలా హై స్పీడ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ -కల్వకుర్తి జాతీయ రహదారి పనులు మొదలు పెట్టాలన్నా రు. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ రహదారితో తిరుపతికి 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం వివరించారు. మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణం పైన ప్రతి వారం తనకు నివేదిక ఇవ్వాలని సీఎంవో కార్యదర్శి షానవాజ్ ఖాసీం ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

### ఎన్‌హెచ్ఏఐ లేవనెత్తిన అంశాలు

- మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ (ఎన్ హెచ్ 163జీ) కారిడార్ నిర్మాణానికి భూముల అప్పగింత
- ఆర్మూర్-జగిత్యాల- మంచిర్యాల ( ఎన్ హెచ్ 63 ) భూ సేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం
- వరంగల్- కరీంనగర్ (ఎన్ హెచ్ 563 ) రహదారి నిర్మాణానికి చెరువు మట్టి ,ఫ్లై యాష్ సేకరణ
- ఎన్‌హెచ్ 44తో కాల్లకల్-గుండ్లపోచంపల్లి రహదారి ఆరు వరుసల విస్తరణకు భూ సేకరణ
- జాతీయ రహదారుల నిర్మాణంలో విద్యుత్ సంస్థలతో తలెత్తున్న సమస్యల పరిష్కారంహెూ
- ఖమ్మం- దేవరపల్లి, ఖమ్మం- కోదాడ రహదారుల నిర్మాణంలో పోలీస్ భద్రత ఏర్పాటు

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం




**విశ్వంభర, షాద్‌నగర్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ షాద్‌నగర్ నగర కమిటి శాఖ ఆద్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ర్యాలి నిర్వహించి జండావిష్కరణ చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు కందడి శ్రీరామ్ పాల్గొని జాండావిష్కరణ చేసి అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జ్ఞానం, శీలం, ఏకత అనే ప్రధాన సిద్ధాంతాల తో, వ్యక్తి నిర్మాణాన్ని పూర్తి చేసి జతీయ పునః నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తుందని,దేశంలో పౌరులంధరు దేశం మనది అనే స్వభావాన్ని పెంపొందించుకోవాలని, ఏబీవీపీ ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థగా విరాజిల్లితుందని, అనేక రకాల అవకాశాలతో ఏబీవీపీ ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విధంగా. రాష్ట్రీయ కళమంచ్, థింక్ ఇండియా, మెడివిజన్,అగ్రివిజన్, అనే ఆయా మాల ద్వార ప్రపంచ వ్యాప్తంగా 55 దేశాలలో సేవా కార్యక్రమాలు చేసి దేశభక్తిని పెంపొందించే విధంగా విద్యార్థి పరిషత్ పనిచేస్తుందని అన్నారు. విద్యార్థులంతా భాగస్వామ్యంతో కార్యక్రమాలలో పాల్గొని దేశం కోసం పని చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సందీప్, నవీన్, అజయ్, మహేందర్, ప్రశాంత్, ప్రకాష్, మనోజ్, మహేష్, శివ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు చేయాలి

### బిజెపి జిల్లా కార్యదర్శి పెంటయ్య గుప్త

**విశ్వంభర, పరిగి :** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం పరిగి పట్టణంలో తహసిల్దార్ ఆనంద్ రావు కు భాజపా నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా భాజపా కార్యదర్శి పెంటయ్య గుప్త మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో చెప్పిన రైతులకు ఇచ్చిన అన్ని హామీలు బేషరతుగా అమలు చేయాలని, అలాగే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని తెలిపారు. రైతు బంధు ఎకరాకు 15 వేల రూపాయలు ఇవ్వాలని, తెలంగాణలో ప్రధానమంత్రి పంట భీమ యోజనను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శ జనార్దన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, పట్టణ బిజెపి అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ పట్టణ బిజెపి అధ్యక్షులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.





## యువతి మిస్సింగ్

**విశ్వంభర, ఘట్కేసర్ :** ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొజ్జ సాయికుమార్ కలసాని ప్రియాంక(26) ఇద్దరు ప్రేమ వివాహం చేసుకొని ఘట్కేసర్‌లో ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్నారు. ప్రియాంక ప్రస్తుతం ఎస్ఏపీ కోర్స్ కి ప్రిపేర్ అవుతున్నది. అయితే ప్రియాంక, జులై 8, సోమవారం 2024 నాడు రాత్రి 8 గంటల సమయంలో తన భర్త సాయికుమార్‌తో చిన్న విషయంలో గొడవపడి ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఫోన్ ఇంట్లోనే పెట్టేసి వెళ్లిపోయింది. ఆమె ఇంట్లో నుంచి వెళ్ళిపోయినప్పుడు పీచ్ కలర్ టాప్ గ్రీన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నది. అప్పటినుంచి తన భర్త చుట్టాలకు స్నేహితులకు ఫోన్ చేసి విచారించగా ఆమె ఆచూకీ తెలియక పోవడంతో సాయికుమార్ ఘట్కేసర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## అందుబాటులో లేని పశువైద్యులు

- సకాలంలో వైద్యం అందక పశువులు మృత్యువాత
- పశు వైద్యశాల ఎదుట రైతులు ఆందోళన

**విశ్వంభర, కేశంపేట :** పశు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సకాలంలో వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతులు మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి ఎదుట ధర్నాకు దిగారు. గత కొన్ని నెలల నుండి ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు హాజరవుతుండడంతో విసుగు చెందిన రైతులు మంగళవారం నిరసనకు దిగి వైద్య సిబ్బందిని నిలదీశారు. పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు ఫోన్ చేస్తే ఎత్తకపోవడంతో రైతులు గోపాల మిత్రులను సంప్రదిస్తే వేలకు వేలు రైతుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. పశువుల ఆసుపత్రిలో మందులు పుష్కలంగా ఉన్న రైతులకు ఇవ్వకుండా బహిరంగ మార్కెట్ కు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు తమ ఇష్టానుసారంగా విధులకు హాజరవడంతోపాటు రైతులకు అందుబాటులో ఉండడం లేదని విమర్శలు ఉన్నాయి. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తుండడంతో తమ పశువులు మృత్యువాత పడుతున్నాయని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంచార్జ్ ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డికి మండల రైతులు ఫిర్యాదు చేశారు.

## బెదిరింపులు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకుడిపై వేటు

**విశ్వంభర, కూకట్‌పల్లి :** భవన నిర్మాణం వద్ద బెదిరింపులకు పాల్పడిన ఫణీంద్ర అనే నాయకుడిని కాంగ్రెస్ జిల్లా నాయకులు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు లేక విడుదల చేశారు. కూకట్ పల్లి కెపిహెచ్ బి కాలనీలోని ఎల్ఐజి 121 భవన రిమోడలింగ్ చేస్తుండగా 20,000 ఇవ్వాలని ఫణీంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు కూకట్‌పల్లి ఇంచార్జ్ బండి రమేష్‌కు ఫిర్యాదు రావడంతో జిల్లా నాయకులకు తెలపడంతో చర్యలు తీసుకున్నారు. ఇలాంటి చర్యలకు ఎవరూ పాల్పడిన తీవ్రమైన చర్యలుంటాయని పేర్కొన్నారు.



# ఓయూలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం

• బీఆర్ఎస్వీ నాయకుల ఆందోళన • అరెస్ట్ చేసిన పోలీసులు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతూనే ఉంది. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్వీ నాయకులు దహనం చేశారు. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినదించారు. ఆందోళనకు దిగిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. నిరుద్యోగుల కన్నీటికి కారణమైందంటూ మండిపడ్డారు. నిరుద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదా వేసి, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో నిరుద్యోగులే తగిన బుద్ధి చెప్తారని వారు పేర్కొన్నారు. మరో వైపు ఓయూలో పోలీసులు భారీగా మోహరించారు. స్థానిక పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలను రంగంలోకి దించారు. ల్యాండ్ స్కేప్ గార్డెన్‌లోకి ప్రవేశించిన పోలీసు బలగాలు.. విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారు. కనిపించిన విద్యార్థిని కనిపించినట్టే అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థుల నుంచి పోలీసులు బలవంతంగా సెల్‌ఫోన్లు లాక్కున్నారు. ఫోన్లు ఎందుకు తీసుకుంటున్నారంటూ విద్యార్థులు పోలీసులను నిలదీశారు. దీంతో విద్యార్థుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. పోలీసు బలగాలను చూసి విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నాటి పరిస్థితులు గుర్తుకు వస్తున్నాయని గుర్తు చేశారు.

అసలు యూనివర్సిటీలోకి పోలీసులకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించా రు. మేం ఉగ్రవాదులం కాదు.. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదని నిలదీశారు. తమ ఓట్లతో గెలిచిన రేవంత్ రెడ్డి.. తమపైనే కక్ష సాధింపు చర్యలకు పాల్ప డడం సరికాదని నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థినుల అల్పాహారంలో బల్లి

• పలువురికి అస్వస్థత • ఆస్పత్రిలో చికిత్స



**విశ్వంభర, మెదక్ :** తెలంగాణలో హాస్టళ్ల పరిస్థితులు అధ్వానంగా మారాయి. కనీస వసతులు లేక, ఉడికి ఉడకని అన్నంతో హాస్టల్ విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల విద్యార్థులు తినే ఆహారంలో పురుగులు దర్శనమివ్వడంతో ఆందోళనకు దిగారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విద్యార్థులు జాతీయ రహదారిపై సైతం ఆందోళన చేపట్టారు. తాజాగా మెదక్ జిల్లా రామాయంపేట మండలలోని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్లో ఉదయం విద్యార్థినులకు పెట్టే టిఫిన్‌లో బల్లి పడటం కలకలం రేపింది. టిఫిన్ తిన్న 17 మంది విద్యార్థినులు వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే హాస్టల్ సిబ్బంది విద్యార్థినులను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, తాము రోజూ తినే ఆహారంలో పురుగులు వస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్స్‌లో తనిఖీలు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

# సిత్ల భవాని పండగ మహోత్సవం



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో సిత్ల భవాని పండగ మహోత్సవం నిర్వహించారు. మహోత్సవానికి కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు. గిరిజనుల ఆరాధ్య దైవం శీత్ల భవాని అమ్మ వారి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కి శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కంఠం రమేష్, ఎల్లాల దశరథ్ రెడ్డి, జెడి సుమన్, పుప్పాల నరసయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

• ప్రోటోకాల్ పాటించకపోతే సహించేది లేదు
• ప్రజా సమస్యలు తీర్చేందుకు పూర్తిగా సహకరిస్తాం
• ఎమ్మెల్యే మాదారం కృష్ణారావు




**విశ్వంభర, కూకట్‌పల్లి :** అధికారులు సంక్షేమ పథకాలలో, అభివృద్ధి పనుల్లో ప్రోటోకాల్ పాటించాలని కూకట్ పల్లి జోనల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గం కార్పొరేటర్లతో కలిసి జోనల్ కార్యాలయంలో జెడ్ సి అపూర్వ చౌహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గత ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ లతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న స్థానిక సమస్యలపై జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కును త్వరగా తొలగించి ప్రజలకు దోమల బెడత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాలాలలో పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను త్వరగా తొలగించాలని లేకపోతే నాళాలకు అనుకుని ఉన్న బస్తీలు మునిగిపోతాయని వారు గుర్తు చేశారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు పూర్తిగా సహకరి స్తామని జోనల్ కమిషనర్‌కు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నర్సింహ్మాయాదవ్, ఆవుల రవీందర్రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, సబీహా గౌసుద్దీన్, పగుడాల శిరీషాబాబురావు, మందడి శ్రీనివాస రావు, జూపల్లి సత్యనారాయణరావులు, జిహెచ్ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చట్నీలో ఎలుక..

## విచారణకు ఆదేశించిన మంత్రి



**విశ్వంభర, సంగారెడ్డి :** విద్యార్థులు తినే చట్నీలో ఎలుక దర్శనమివ్వడం సంగారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. సంగారెడ్డి జిల్లా చౌటాకూర్ మండలం సుల్తాన్పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ చట్నీ పాత్రలో ఎలుక కనిపించింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి దామోదర అధికారులను ఆదేశించడంతో అధికార యంత్రాంగం కదిలివచ్చింది. ఈ ఘటనపై ప్రతిపక్ష నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా సుల్తాన్పూర్ జేఎన్టీయూ హస్టల్లో విద్యార్థులు తినే చట్నీలో ఎలుక దర్శనమిచ్చింది. ఈ ఘటన నిన్న రాత్రి చోటు చేసుకోగా ఈరోజు ఉదయం వెలుగులోకి వచ్చింది. గతకొన్ని రోజులుగా నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఫుడ్ కాంట్రాక్టర్ను మార్చాలంటూ విద్యార్థులు అందోళనకు దిగారు. ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపల్, ఫుడ్ కాంట్రాక్టర్ను నిలదీసిన ప్రయోజనం లేకుండా పోయింది. విద్యార్థుల అందోళన నేపథ్యంలో ఇటీవల ఫుడ్ ఇన్స్పెక్టర్ ధర్మేందర్ హస్టల్ ను తనిఖీ చేసి, అక్కడున్న భోజన నమునాలను సేకరించి ల్యాబ్ కు పంపించారు.

# సోషల్ మీడియాలో ఫస్ట్ నైట్ వీడియో

• కొత్త జంట పిచ్చి పని
• దుమ్మెత్తి పోస్తున్న నెటిజన్లు



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రస్తుతం సోషల్ మీడియా పిచ్చి పీక్స్‌కి చేరింది. లైక్స్ కోసం ఫాలోవర్లను పెంచుకోవడానికి ఎంతకైనా దిగజారుతున్నారు. కొందరు ప్రాణాలను పనంగా పెడుతుంటూ మరికొందరు మాత్రం ఆత్మగౌరవా న్ని, సిగ్గును కూడా వదిలేస్తున్నారు. ఎలాగైనా పాపులర్ అవ్వాలని వ్యక్తిగత జీవితాలను కూడా బజార్లో పెట్టేసుకుం టున్నారు. తాజాగా ఇలాంటి ఓ వీడియోనే సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఓ కొత్త జంట ఏకంగా తమ మొదటి రాత్రి వీడియోను సోషల్ మీడియాలో పెట్టేసింది. కొత్తగా పెళ్లైన ఓ జంటకు శోభనం ఏర్పాటు చేశారు. గదిని పూలతో అలంకరించారు. అయితే నాలుగు గోడల మధ్య జరగాల్సిన ఈ కార్యాన్ని కాస్త మనోడు అత్యుత్సాహంతో సోషల్ మీడియాలో పెట్టేశాడు. తన భార్యతో కలిసి ఫస్టనైట్ రోజు కూడా వ్లాగ్‌ను పోస్ట్ చేశాడు. పూలతో అలంకరించిన మంచాన్ని వీడియోలో చూపిస్తూ, తన భార్యను పిలిచి మరీ నెటిజన్లతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ వీడియోలో సదరు వ్యక్తి మాట్లాడుతూ.. 'హేయ్ ఫ్రెండ్స్.. ఈ రోజు మా ఫస్ట్ నైట్ జరగబోతోంది.. మంచాన్ని సువాసన వెదజల్లే పూలతో ఎంతో అందంగా అలంకరించారు' అని చెప్పుకొచ్చాడు. అంతటితో ఆగకుండా తన భార్యతో సైతం వీడియోలో మాట్లాడించా డు. దీంతో సదరు మహిళ కూడా నవ్వుతూ వీడియోలో మాట్లాడింది. దీనతంటినీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో కాస్త తెగ వైరల్ అయ్యింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారు. వ్యక్తిగత జీవితాలను ఇలా అందరికీ చెప్పడంలో ఏంటని విరుచుకుపడుతున్నారు. ఇక మరికొందరైతే పిచ్చి పీక్స్‌కి చేరిందని కామెంట్స్ చేస్తున్నారు.




# పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య జన్మదినోత్సవం

## ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు నోముల శంకర్

**విశ్వంభర, రామన్నపేట :** ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య 87వ జన్మదిన వేడుకలు వారి స్వగ్రామమైన వెల్లంకి వారి గ్రంథాలయంలో డాక్టర్ నకిరే కంటి అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో గొప్ప మహాకవి ఎన్నో అవార్డులు అందుకున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే అవార్డులు అందుకొని ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేత పద్మశ్రీ అవార్డు అందుకున్నటువంటి డాక్టర్ కురెళ్ళ విఠలాచార్య జన్మదిన వేడుకల్లో భాగంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తన కలంతో ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప కవి. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ఆనాడు దశరథి చెబితే ఉద్యమంలో నా తెలంగాణ కోట్ల రతనాల వీణ అని ఎన్నో సభల్లో ప్రసంగించిన గొప్ప కవి రచయిత అని నాడు వెల్లంకి గ్రామంలో ఉద్యమాన్ని ముందుకు నడపాలని డాక్టర్ అశోక్ ని ఇన్స్పైర్ చేసి కళాకారులను ఏర్పాటు చేసిన గొప్ప కవి అని వెల్లంకి గ్రామాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన గొప్ప ఆదర్శమూర్తి అని తన ఇంటినే గ్రంథాలయంగా మార్చి దేశ ప్రధాని చేత మంకీ బాత్ ప్రోగ్రాంలో మాట్లాడించిన వ్యక్తి ఎంతోమంది ప్రొఫెసర్లను గ్రామానికి పరిచయం చేసిన వ్యక్తి తన గ్రంథాలయాన్ని మోటివేషన్ గా తీసుకొని ఎన్నో గ్రామాల్లో నేడు గ్రంథాలయాలు ఏర్పాటు చేయించిన గొప్ప వ్యక్తి ఈ గ్రామాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి అని తెలుపుతూ శాల్వతో సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు నోముల శంకర్, ఉద్యమకారుల ఫోరం గ్రామ శాఖ అధ్యక్షులు గుని రాజు, ఉద్యమ సమయంలో వెల్లంకి గ్రామానికి జేఏసీ కన్వీనర్‌గా వ్యవహరించిన వ్యక్తి తాటిపాముల స్వామి గౌడ్, కార్యదర్శి సంఘ స్వామి, కోశాధికారి జినుక గోవర్ధన్, సహాయ కార్యదర్శి కాకి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిపథంలో తీసుకెళ్లేందుకు చర్యలు

### సీఎం చంద్రబాబు ముమ్మర యత్నాలు




**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ ను డెవలప్ చేసే లక్ష్యంతో సీఎం చంద్రబాబు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రాన్ని ముందుకు నడిపించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన పాలన అందించే ఉద్దేశంతో శ్రమిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలను తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నేడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 227వ ఎస్ఎల్బిసి సమావేశం జరిగింది. స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ మీటింగ్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రుణ ప్రణాళిక విడుదల చేయడంతో పాటు 5ప్రధాన అంశాలపై మెరుగైన ఫలితాలు సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్లతో సబ్ కమిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి 5.4లక్షల కోట్ల రూపాయలతో రుణ ప్రణాళికలు విడుదల చేశారు. ఇందులో 3.75 లక్షల కోట్లు ప్రాధాన్యతా రంగాలకు 1.65 లక్షల కోట్ల రూపాయలు ఇతర రంగాలకు కేటాయిస్తూ రుణ ప్రణాళికను విడుదల చేశారు. 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగాలకు 3. 23 లక్షల కోట్లు రుణ ప్రణాళిక పెట్టుకోగా ఈ ఆర్థిక సంవత్సరం 3.75 లక్షల కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. గతేడాది కంటే 16 శాతం అధికంగా రుణాలను లక్ష్యంగా నిర్ణయించారు. వ్యవసాయ రంగానికి 2.64 లక్షల కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. అంటే గతం కంటే 14 శాతం అధికంగా వ్యవసాయ రంగానికి రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలకు, డైరీ, పౌల్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ యాంత్రీకరణ తదితరాలకు 32వేల 600 కోట్లతో రుణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఇక వ్యవసాయ రంగానికి గత సంవత్సరం రెండు లక్షల 31 వేల కోట్లు రుణ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే అందులో రెండు లక్షల ఎనిమిది వేల 136 కోట్ల రుణాలను మంజూరు చేశారు. కాగా ఉద్యోగ ఉపాధి కల్పనకు దోహదపడే సూక్ష్మ మరియు మధ్య తరహా ఉపాధి రంగానికి గత సంవత్సరం 69 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, ఈ సంవత్సరం 87 వేల కోట్ల లక్ష్యంగా నిర్ణయించారు. అంటే గతేడాది కంటే 26 శాతం అధికంగా రుణాలు ఇవ్వాలని ప్లాన్ చేశారు. గృహ నిర్మాణ రంగానికి 11500 కోట్ల రూపాయల రుణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు బ్యాంకర్ లకు ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించి పథకాల అమలుకు, అభివృద్ధికి బ్యాంకర్ల సహాయం అవసరమని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల బలోపేతం లో బ్యాంకర్ల దే ప్రాధాన్యత అన్నారు.




## పిఎసిఎస్ చైర్మన్‌ను సన్మానించిన
# నాప్కాబ్ చైర్మన్ కొండూరి

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డిని కరీంనగర్ కేడీసీసీ మరియు నాప్కాబ్ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు మంగళవారం శాలువాతో సన్మానించారు. మహాదేవపూర్ పీఏసీఎస్కు (ఎన్సిడిసి) జాతీయ కో-ఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ 2023 సంవత్సరానికి ఎక్సులెన్సి అవార్డు రావటం పట్ల హర్షం వ్యక్తం చేసిన రవీందర్ రావు కరీంనగర్ లోని తన కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. మహాదేవపూర్ సంఘం అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని రవీందర్ రావు అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ తిరుపతి రెడ్డి తోపాటు మహాదేవపూర్ పిఏసిఎస్ డైరెక్టర్ దాసరి సమ్మయ్య ఉన్నారు.

## కొత్త ప్రభుత్వం వచ్చినా..
# పాత బకాయిలు తీర్చరా


### ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్



**విశ్వంభర, భూపాలపల్లి :** ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూలై 11 న జరిగే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించినటువంటి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు హాజరై మాట్లాడుతూ.. పెండింగ్లో ఉన్న రూ.7500కోట్ల స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, అదేవిధంగా ఎస్ఎంఎస్ హాస్టల్స్ కు సొంత భవనాలు నిర్మించాలని జిల్లాలోని ఉన్నటువంటి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కూల్లో చదువుకున్న విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, జిల్లా కేంద్రంలో వివిధ మండలాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసి హాస్టల్ వసతి కల్పించాలని అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి మండలాలలో రెగ్యులర్‌లను నియమించాలని తదితర డిమాండ్స్ తో ఈ నెల 11 న చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులు అందరూ కూడా అధిక సంఖ్యలో హాజరై చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కరుణాకర్, అభిరామ్, స్వామి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# కాయ్ రాజా కాయ్

## లక్షకు లక్ష.. రెండు లక్షలకు రెండు లక్షలు



**విశ్వంభర, చింతపల్లి :** కాయ్ రాజా కాయ్ లక్షకు లక్ష.. రెండు లక్షలకు రెండు లక్షలు ఆలోచించిన ఆశాభంగం మంచితరుణం మించినా దొరకదు అంటూ.. పెట్టిన పెట్టుబడికి అధిక వడ్డీలు ఇస్తామంటూ ఆశ చూపించి సుమారు 50 కోట్ల రూపాయల మేర మోసం చేశాడు ఓ ఘరానా మొనగాడు మదిని మనీష్ రెడ్డి తండ్రి సంజయ్ రెడ్డి అనే వ్యక్తి గత నాలుగు సంవత్సరాల నుంచి చింతపల్లి మండలం మాల్ (గొడకొండ్ల) వద్ద మణీ ఎంటర్ప్రైజెస్ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్మెంట్ అండ్ ట్రేడర్స్ పేరుతో ఆఫీస్ పెట్టి వంద రూపాయలకు నెలకు వందతో ప్రారంభం చేసి పదివేలకు పదివేలు యాభై వేలకు యాభై లక్షకు లక్ష ఇలా కొందరికి చెల్లించి అదే గ్రామానికి చెందిన పది మంది ఏజెంట్లను తయారు చేసుకొని వారికి కారు, ఇల్లు కట్టుకోవడానికి డబ్బు ఆశా చూపి ఒక్కో ఏజెంటుకు 16000 వేల జీతం చెల్లిస్తూ నెలకు కోటి రూపాయలు తీసుకురావాలని టార్గెట్లు పెట్టి చింతపల్లి మండలమే కాకుండా మర్రిగూడ, నాంపల్లి, యాచారం, ఇబ్రహీంపట్నం, కరీంనగర్, నిజామాబాద్, చౌటుప్పల్, హైదరాబాద్ ఇలా మండలాల నుంచి జిల్లాలకు తన బ్రాంచ్ ను విస్తరింపజేసి సుమారు 200మంది దగ్గర నుంచి మొత్తంగా సుమారు 50 కోట్ల రూపాయలు స్వాహా చేశాడు అతగాడు. గత ఏడు నెలలుగా వడ్డీ చెల్లించక పోవడంతో అప్రమత్తమైన ప్రజలు నిలదీయడంతో మనీష్ రెడ్డి చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. నన్ను జెల్లో పెట్టండి నేను గ్రామ ప్రజల పోరు తట్టుకోలేనని బీస్మించుకు కూర్చున్నాడు. గ్రామస్థులందరూ పోలీస్ స్టేషన్ కు వచ్చి మాకు వడ్డీ ఇవ్వకున్నా పర్లేదు అసలైన ఇవ్వు అని అడగగా నా దగ్గర రూపాయి కూడా లేదు జెల్లో పెట్టుకుంటారా, చంపేస్తారా చంపేయండి అన సాగాడు. గ్రామస్తులు చేసేది ఏమిలేక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు వద్దు గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకుందాం అని మనీష్ రెడ్డిని పోలీస్ స్టేషన్ నుండి గ్రామానికి తీసుకెళ్లారు. చింతపల్లి మండలం తో పాటు పరిసర ప్రాంతాలు, తెలిసిన వ్యక్తుల బలహీనతలు ఆసరాగా చేసుకుని తక్కువ పెట్టుబడి పెడితే కొద్ది కాలంలోనే అధిక డబ్బులు, లాభాలు పొందవచ్చని నమ్మబలికారు. ఇలా చాలా మందిని మోసం చేసాడని గ్రామ-స్తులు తెలిపారు."మనీష్ ఎంటర్ప్రైజెస్" పేరుతో సాగించిన ఈ దందాలో అదే గ్రామానికి చెందిన 9మంది ఏజెంట్లతో కలిసి 200 మంది నుంచి 50కోట్ల రూపాయలు వసూలు చేశారు. ఆ తరువాతే వీరి అసలు రంగు బయటపడింది. ఓ ప్రభుత్వ బ్యాంకు క్యాషియర్ భర్త తన భార్యతో కలిసి రూ.65 లక్షల నగదు, ఓ ప్రైవేట్ గోల్డ్ లోన్ బ్యాంకులో పని చేసే వ్యక్తి సైతం రెండు లక్షల ఇచ్చానని తెలిపారు. బాధితులకు చెప్పిన ప్రకారం డబ్బులు చెల్లించకుండా వాయిదాల పేరుతో కాలయాపన చేస్తూ వచ్చారు. పైగా తీసుకున్న సొమ్ము సైతం ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో పలువురు బాధితులు పోలీస్ స్టేషన్లో ఆశ్రయించనున్నారు.. అధిక వడ్డీలకు, స్వల్పకాలంలో తక్కువ పెట్టుబడితో అధిక మొత్తం ఇస్తామని చెప్పే వారితో జాగ్రత్తగా ఉండాలని, ఇలా ఎవరైనా మోసం చేసే ప్రయత్నం చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.



## స్కిల్ సెంటర్ టీచర్స్‌తో
# సమావేశం



**విశ్వంభర, హైదరాబాద్ :** ఏబీవీ ఫౌండేషన్ స్కిల్ సెంటర్ చైర్మన్ కావ్య కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో ఉన్న స్కిల్ సెంటర్ టీచర్స్ తో మీటింగ్ నిర్వహించారు. స్కిల్ సెంటరర్‌లో ఉన్న సమస్యల గురించి మరియు కమ్యూనిటీ హాల్స్ వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్లో మొత్తం ప్రస్తుతం 16 స్కిల్ సెంటర్స్ రన్ అవుతున్నాయని తెలిపారు. అదే కాకుండా టీచర్స్ వారి వారి సమస్యలను కావ్య కిషన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జెరిపేటి జైపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్

– విశ్వంభర, కూకట్‌పల్లి



## ఫసల్ బీమా యోజన
# వెంటనే అమలు చేయాలి

### బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా

**విశ్వంభర, షాద్‌నగర్ :** తెలంగాణలో ఫసల్ బీమా యోజన వెంటనే అమలు చేయాలి అని ఫరూక్నగర్ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అందే బాబయ్య మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులను ఉద్దేశించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు నుంచి ఐదు పథకాలు రైతులకు అమలు చేస్తానని మోసం చేశారు. వీటిలో ముఖ్యమైనది రైతులకు రెండు లక్షల రుణమాఫీ, కానీ ఇప్పటివరకు రు-ణమాఫీ చేసింది లేదు. గతంలో బీఆర్ఎస్ పార్టీ లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తాం అని మోసం చేసింది. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మోసం చేశారు. నేను ఒక రైతునే నాకు ఇప్పటివరకు రెండు లక్షల రు-ణమాఫీ కాలేదు, చివరికి ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజలకు గాడిద గుడ్డు చూపెట్టాడు. రెండవది కౌలు రైతుల సమస్య, కౌలు రైతులకు ఏడాదికి 12,000 ఇస్తానని మోసం చేశారు. కౌలు రైతులు తమకు 12000 వస్తాయని నమ్మి ఓట్లు వేస్తే చివరకు గుండు సున్న చుయించారు. మూడవది రైతుబంధు గత ప్రభుత్వం 10000 ఇస్తామని హామీ ఇచ్చారు కానీ ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి 15000 లు ఇస్తానని ప్రగల్భాల్ పలికారు కానీ ఇప్పటివరకు కౌలు రైతులకు ముట్టిందేమీ లేదు. ఇప్పటికైనా మేల్కొని ఇచ్చిన హామీల అమలు చేయాలని కోరారు. పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా పిలుపుమేరకు మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్‌కు వినతి పాత్ర వేయడం జరిగింది. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి గెలిచిన తర్వాత రైతు ప్రభుత్వం చేస్తానని మాట ఇచ్చారు, గెలిచి 200 రోజులు గడిచిన ఇప్పటివరకు రైతుల ఊసే లేదు. రాష్ట్రంలో ఏదో ఒక గ్రామంలో రైతుల ఆత్మహత్యలు వినడం బాధాకరం. కేంద్రంలో ఫసల్ బీమా పథకం అమలు చేయడం జరిగింది. కానీ గత ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని నిర్వీర్యం చేశారని చెప్పారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఈ ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తానన్నారు కానీ ఇప్పటివరకు దాని మాటే లేదు. పంటలకు మద్దతు ధర ఇస్తానని మాటిచ్చారు కానీ, పంటల మద్దతు ధర ఏమైంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రామకృష్ణ యాదవ్, పట్టణ అధ్యక్షులు హరి భూషణ్ పటేల్, కాసోజు శివ, శ్యామసుందర్, రుషికేష్, వంశీ కృష్ణ, అందెల సందీప్ కిరణ్ గౌడ్, ఇస్నాతి శ్రీనివాస్, మల్చలం మురళి, చెట్ల వెంకటేష్, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం

**విశ్వంభర, భూపాలపల్లి :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహాదేవపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో జులై 9న జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించారు. నగర కార్యదర్శి పేట సాయి మాట్లాడుతూ.. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ.. విద్యార్థులను చైతన్యవంతం చేస్తూ అలాగే జాతీయ పున:నిర్వహణ చేస్తూ, వ్యక్తి నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతూ.. ఈ దేశానికి ఎందరో గొప్ప గొప్ప మేధావులను, రాజకీయ నాయకులను అందిస్తూ, ఎక్కడ దేశానికి గాని సమాజానికి గాని ఆపద వచ్చినా దేశానికి అదేవిధంగా ఈ ప్రపంచంలో ఎక్కడ ఏ మూలైన ఏ విద్యార్థి ఆపద వచ్చినా అండగా నిలుస్తూ దేశంలోనే కాదు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత కార్యకర్తలు, పూర్వ కార్యకర్తలు పాల్గొన్నారు.



# హత్రాస్ ఘటనపై సుప్రీం కీలక నిర్ణయం

**విశ్వంభర, ఢిల్లీ :** హత్రాస్ తొక్కిసలాట ఘటనలో సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై కీలక నిర్ణయం తీసుకున్నది. పిటిషన్‌ను విచారణ కోసం సోమవారం లిస్ట్ చేయాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ నెల 2న హత్రాస్‌లో భోలే బాబా నిర్వహించిన సత్సంగంలో తొక్కిసలాట జరిగి 121 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీని నియమించాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. ఘటనపై నివేదిక తయారు చేసి బాధ్యులపై చర్యలు తీసుకునేలా యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్లో కోరారు. న్యాయవాది విశాల్ తివారీ మట్లాడుతూ.. హత్రాస్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. జాబితా చేసేందుకు కోర్టు సిద్ధంగా ఉందని.. త్వరలోనే విచారణ జరుగుతుందని పేర్కొన్నారు. తాము ఓ కమిటీ ఏర్పాటుకు డిమాండ్ చేశామని.. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉందన్నారు. ఇదిలా ఉండగా.. తొక్కిసలాట ఘటనలో ఇప్పటి వరకు 121 మంది మృతి చెందారు. ఇందులో మృతుల్లో మహిళలు, పిల్లలే ఎక్కువ ఉన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా సహా పలు రాష్ట్రాల నుంచి ప్రజలు ఈ సత్సంగానికి జనం తరలివచ్చారు. వాహనాల సంఖ్య మూడు కిలోమీటర్ల మేర విస్తరించి ఉండడంతో రద్దీని అర్థం చేసుకోవచ్చు. సత్సంగం ముగిసిన తర్వాత భోలే బాబా పాదధూళిని తీసుకునేందుకు జనం ఎగబడిన సమయంలో తొక్కిసలాట చోటు చేసుకున్నది. భద్రత కల్పించడంలో నిర్వాహకులు, పోలీసుల వైఫల్యం చెందారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు పలువురిని అరెస్టు చేశారు.

# కర్ణాటకలో ఆ జిల్లా పేరు మారనుందా?

## దక్షిణ బెంగుళూరుగా మార్చే అవకాశం



**విశ్వంభర, బెంగుళూరు :** ఏపీ తరహాలోనే పొరుగునే ఉన్న కర్ణాటకలో జిల్లాల పేర్ల మార్పు మళ్లీ తెరమీదికి వచ్చింది. గతంలో బెల్గాం, షిమోగ, బిజాపూర్, గుల్బర్గా వంటి జిల్లాల పేర్లను మార్చారు. బెళగావి, శివమొగ్గ, విజయపుర, కలబురగిగా మార్పు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా డిమాండ్ ఊపందుకుంటోన్నట్టే కనిపిస్తోంది. బెంగళూరుకు ఆనుకుని ఉన్న రామనగర జిల్లా పేరును దక్షిణ బెంగళూరుగా మార్చాలంటూ అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టుబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు వినతిపత్రాన్ని సైతం అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం ఉండటం చర్చనీయాంశమైంది. రామనగర జిల్లా పరిధిలోని రామనగర, చెన్నపట్టణ, కనకపుర, మాగడి, హారోహళ్లి తాలూకాలో ఉండగా.. మెజారిటీ బెంగళూరు దక్షిణ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. కనకపుర, మాగడి, హారోహళ్లి తాలూకాల్లోని అనేక గ్రామాలు బెంగళూరు సౌత్ లోక్‌సభ పరిధిలోనివే. కనకపుర- డీకే శివకుమార్ సొంత అసెంబ్లీ నియోజకవర్గం. నగర పరిధి శరవేగంగా విస్తరిస్తోన్న నేపథ్యంలో రామనగర పేరును దక్షిణ బెంగళూరుగా మార్చాలంటూ కాంగ్రెస్ నాయకులు పట్టుబట్టారు. డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేష్, మంత్రి రామలింగారెడ్డి, అశ్వర్థ.. తదితరులు సచివాలయంలో సిద్ధరామయ్యను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గతంలో ఆయా ప్రాంతాలన్నీ కూడా బెంగళూరు రూరల్ జిల్లా పరిధిలో ఉండేవి. దొడ్డబళ్లాపుర, నెలమంగళ, యలహంక, దేవనహళ్లి, అనేకల్, బెంగళూరు సౌత్, బెంగళూరు ఈస్ట్, హొసొకోటె, రామనగర, మాగడి, కనకపుర, చెన్నపట్టణ తాలూకాలు బెంగళూరు రూరల్ జిల్లాలో భాగం. పరిపాలన సౌలభ్యం కోసం 2007లో రామనగర జిల్లాను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

రామనగర, మాగడి, కనకపుర, చెన్నపట్టణ, హారోహళ్లి తాలూకాల ను ఇందులో విలీనం చేశారు. ఇప్పుడు మారి న పరిస్థితులకు అనుగుణంగా రామనగర పే రును దక్షిణ బెంగళూరు జిల్లాగా మార్చాలం టూ డిమాండ్ చేస్తోన్నారు కాంగ్రెస్ నాయకులు. దీని వెనుక రియల్ ఎస్టేట్ పెద్దలు ఉన్నారని చెబుతున్నారు.

# ప్రీమియం ఎకానమీ సీట్లతో కొత్త విమానం

**విశ్వంభర, బిజినెస్ :** ఎయిర్ ఇండియా చేతిలోకి ప్రీమియం ఎకానమీ సీట్లు అమర్చిన నారోబాడీ విమానం ఏ320 నియో వచ్చి చేరింది. ఈ విమానంలో 8 విలాసవంత బిజినెస్ తరగతి సీట్లు, 24 ప్రీమియం ఎకానమీ సీట్లు, సౌకర్యవంతమైన 132 ఎకానమీ సీట్లు ఉంటాయి. ప్రస్తుత విమానాల డిజైన్‌కు చాలా భిన్నంగా, సరికొత్త లివరీతో ఈ ఫ్లైట్‌ను తీర్చిదిద్దారు. ఫ్రాన్స్‌లోని ఎయిర్‌బస్ తయారీ ప్లాంటు నుంచి దిల్లీ విమానాశ్రయానికి ఆదివారమే ఈ విమానం వచ్చింది. ప్రభుత్వ ఆధీనంలోని ఎయిరిండియా, టాటా గ్రూప్ ఆధీనంలోకి వచ్చాక, విమానాల ఆధునికీకకరణ ప్రారంభమైంది. కొత్త విమానాల కొనుగోలు సహా, ఇప్పటికే ఉన్న విమానాల్లోని సీట్లను, ఇతర సదుపాయాలను ఎయిర్‌ఇండియా మెరుగుప రుస్తోంది. వచ్చే నెల నుంచి దేశీయ మార్గాల్లో ఈ విమానాన్ని నడపనున్నారు. ఇప్పటికే ఎయిరిండియా దగ్గర 3 ఎయిర్‌బస్ 320 నియో ఫ్లైట్స్ ఉన్నా, అవన్నీ పాత డిజైన్ ప్రకారం రూపొందించినవి.




# గోల్ఫ్ కారులో మోడీ, పుతిన్ షికారు





**విశ్వంభర, ఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రష్యా పర్యటన కొనసాగుతోంది. రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని నిన్న ఢిల్లీ నుంచి బయల్దేరి వెళ్లిన విషయం తెలిసిందే. రష్యాలో ల్యాండ్ అయిన మోదీకి ఘన స్వాగతం లభించింది. ఇక మాస్కో శివార్లలోని నోవో-ఒగార్యోవో అధికార నివాసంలో మోదీని పుతిన్ సాదరంగా ఆహ్వానించారు. మోదీకి పుతిన్ తన అధికారిక నివాసాన్ని దగ్గరుండి మరీ చూపించారు. గోల్ఫ్‌కార్ట్ (గోల్ఫ్‌కారు)లో షికారు చేస్తూ ఇంటి ప్రాంగణంలో కలియ తిరిగారు. మోదీని పక్కనే కూర్చోబెట్టుకుని గోల్ఫ్ కారును పుతిన్ స్వయంగా నడపడం విశేషం. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. భారత్‌కు భారీ దౌత్య విజయం లభించింది. రష్యా సైన్యంలో పనిచేస్తున్న భారతీయులను విడుదల చేసేందుకు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సమ్మతించారు. వెంటనే వారిని ఆర్మీ విధులను వెనక్కి రప్పిస్తామని, స్వదేశానికి పంపించడానికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ప్రధాని మోదీకి ఇచ్చిన ప్రైవేట్ విందులో పుతిన్ మాట ఇచ్చినట్లు సమాచారం. కాగా, ఉక్రెయిన్‌పై మాస్కో యుద్ధం తర్వాత మోదీ ఆ దేశ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర పుతిన్ ఆహ్వానం మేరకు రష్యా వెళ్లిన మోదీ.. 22వ భారత్ - రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత 10వ తేదీ ఆస్ట్రియాలో అధికారిక పర్యటన చేపట్టనున్నారు. భారత ప్రధాని ఆస్ట్రియాకు వెళ్లడం 41 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం విశేషం.

# అమెరికాలో నలుగురు తెలుగువాళ్లు అరెస్ట్


CHANDAN DASIREDDY DWARAKA GUNDA SANTHOSH KATKOORI ANIL MALE

**విశ్వంభర, ఢిల్లీ :** అమెరికాలో నలుగురు తెలుగువాళ్లు అరెస్టయ్యారు. మానవ అక్రమ రవాణాతో పాటు పలువర్ని నిర్బంధించి తమ కంపెనీల్లో వెట్టిచాకిరి చేయిస్తున్నందుకు వారిని అదుపులోకి తీసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో దాదాపు 100 మందికి పైగా నిర్బంధించి వారితో బలవంతంగా పనిచేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. టెక్సాస్ రాష్ట్రం గిన్స్‌బర్గ్ లేన్‌లోని 1000వ బ్లాక్‌లో ఓ ఇంట్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయని కొద్దిరోజుల క్రితం ప్రిన్స్‌టన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఈ ఏడాది మార్చి 13న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సంతోశ్ కట్కూరి నివాసంలో ప్రిన్స్‌టన్ పోలీసులు, సీఐడీ విభాగం సోదాలు నిర్వహించారు. 15 మంది యువతులను ఆ ఇంట్లో గుర్తించారు. వారితో కట్కూరి, ఇతర షెల్ కంపెనీల్లో సంతోశ్ భార్య ద్వారక గుండా బలవంతంగా పని చేయిస్తున్నట్లు నిర్ధారించారు. వారి నుంచి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, ఇతర కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ సోదాల అనంతరం జరిపిన విచారణలో ప్రిన్స్‌టన్‌తో పాటు మెలీసా, మెక్‌కిన్నీ తదితర ప్రాంతాల్లోనూ ఇలాగే బాధితులతో బలవంతంగా వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోనూ ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, ఇతర కీలక డాక్యుమెంట్లను సీజ్ చేశారు. వాటన్నింటినీ పరిశీలించిన అనంతరం.. నిందితులు అక్రమంగా కంపెనీలు నెలకొల్పి కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తేల్చారు. వీరికి చందన్ దాసిరెడ్డి, అనిల్ మాలే సైతం వీరికి సహకరించినట్లు గుర్తించారు. దీంతో నలుగురిపై అరెస్టు వారెంట్ జారీ చేశారు. దీంతో వారిపై హ్యూమన్ ట్రాఫికింగ్, గృహ నిర్బంధం కేసులు నమోదు చేశారు.



# లోయలోకి దూసుకెళ్లిన బస్సు

- ఇద్దరు చిన్నారుల మృతి
- 64 మందికి గాయాలు


**విశ్వంభర, నాసిక్ :** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. మరో 64 మందికి గాయాలయ్యాయి. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. గుజరాత్ సరిహద్దుల్లోని డాంగ్ జిల్లా పరిధిలోగల సత్పురా ఘాట్ దగ్గర ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న వాహనాన్ని బస్సు డ్రైవర్ ఓవర్ టేక్ చేయడం ప్రమాదానికి కారణమైంది. ఓవర్ టేక్ చేసిన ప్రాంతంలోనే మూలమలుపు ఉండటంతో ఆలస్యంగా గమనించిన బస్సు డ్రైవర్ అదుపు చేయలేక పోయాడు. దాంతో బస్సు ఎదురుగా ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. బస్సులోని ఓ ప్రయాణికుడి జర్నీని తన మొబైల్ రికార్డు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దాంతో బస్సు లోయలోకి దూసుకెళ్తున్న దృశ్యాలు, ప్రయాణికుల ఆర్తనాదాలు ఆ మొబైల్‌లో రికార్డయ్యాయి. ఈ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 70 మంది ప్రయాణికులు ఉన్నారు. కాగా ఈ ప్రమాదం ఆదివారం చోటుచేసుకుంది.

# నూతన ఒరవడి సృష్టిస్తున్న నారా లోకేష్ 'ప్రజాదర్బార్'

- సమస్యలను విన్నవించేందుకు 14వ రోజు భారీగా తరలివచ్చిన ప్రజలు
- నమస్కారం తాతయ్య, నమస్కారం అమ్మ.. అంటూ మంత్రి ఆత్మీయ పలకరింపు
- విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి



**విశ్వంభరా, అమరావతి :** ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న "ప్రజాదర్బార్" నూతన ఒరవడితో ముందుకు సాగుతోంది. సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజలను నమస్కారం తాతయ్య, నమస్కారం అమ్మ, నమస్కారం చెల్లీ అంటూ ఆత్మీయంగా పలకరిస్తున్న యువనేత.. వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్నారు. గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురిచేశారు. నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరిని నేరుగా కలిసి విజ్ఞప్తులను స్వీకరించడంతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి సిబ్బంది ఆదేశాలు జారీ చేశారు. 14వ రోజు ప్రజాదర్బార్ కు మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కొంతమంది ఆయాలు, పారిశుద్ధ్య కార్మికులను గత ప్రభుత్వం అర్ధాంతరంగా తొలగించిందని, ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన ఏపీజీసీఏఎస్ యూనియన్ ప్రతినిధులు నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, పాఠశాలల విలీనం వల్ల పని ఒత్తిడి పెరిగిందని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కనీసం వేతనం అమలుచేయడంతో పాటు అకారణంగా విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఆయాలు, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను విన్న మంత్రి లోకేష్... పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. పక్షవాతంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం మెల్లంపూడికి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన సతీమణి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం చేయాలని మంగళగిరి హుడా కాలనీకి చెందిన షేక్ మౌలాలి కోరారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడేపల్లి కిస్నా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీతం బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కేసీ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తమ ప్రాంతంలో తాగునీటి సరఫరాతో పాటు వీధి లైట్లు ఏర్పాటుచేయాలని ఆత్మకూరులోని సీతారామ అపార్ట్‌మెంట్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరిపించి, తక్షణమే వైస్ ఛాన్స్ లర్ ను నియమించాలని విశాఖకు చెందిన ఏపీ బీసీ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్న తనను గత ప్రభుత్వం అకారణంగా తొలగించిందని, తిరిగి ఉద్యోగం కల్పించాలని ఎన్. మహేశ్వరి కోరారు. శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న తనకు మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డీసీ ఉన్నూరు సాహెబ్ కోరారు. గుంతకల్లు నియోజకవర్గం కసాపురం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ కు మరమ్మతులు చేయించి 8 గ్రామాల ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలని వై.జీవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మూడేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న దివ్యాంగ ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించాలని విజయవాడకు చెందిన ఏపీజీఎస్ డబ్ల్యూఎస్ దివ్యాంగ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.



# స్టాక్ మార్కెట్ల జోరు..

## సరికొత్తగా జీవితకాల గరిష్ఠాలకు సూచీలు

**విశ్వంభర, బిజినెస్ :** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మరోసారి సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లలో లాభాల్లో కొనసాగిన మార్కెట్లు.. చివరకు రికార్డు స్థాయిలో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. ఉదయం 80,107.21 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,397.17 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరుకొని ఆల్‌టైమ్ హైకి చేరుకున్నది. చివరకు 391.26 పాయింట్ల లాభంతో 80,351.64 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం కిత్రం సెషన్‌తో పోలిస్తే 24,351.00 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. చివరలో కొనుగోళ్ల మద్దతుతో 24,443.60 పాయింట్లకు పెరిగి జీవితకాల గరిష్ఠానికి చేరింది. చివరకు 112.65 పాయింట్లు పెరిగి.. 24,433.20 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,771 షేర్లు పెరిగాయి. మరో 1,664 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో మారుతీ సుజుకీ, ఎంఅండ్ఎం, ఐటీసీ, టైటాన్ కంపెనీ, దివీస్ ల్యాబ్స్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ఓఎన్‌టీసీ, టాటా కన్స్యూమర్, రిలయన్స్ ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టపోయాయి. ఐటీ, ఎనర్జీ మినహా అన్ని రంగాల సూచీలు ఆటో, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, రియల్టీ షేర్లు ఒకటి నుంచి 2శాతం పెరిగాయి. స్మాల్‌క్యాప్ సూచీలు సానుకూలంగా ముగిశాయి.



# పరిపాలనలో కొత్త పంథా

## పనుల వేగవంతానికి చంద్రబాబు ప్రత్యేక చర్యలు

**విశ్వంభర, విశాఖపట్నం:** సీఎం చంద్రబాబు నాయుడు కార్యదీక్షాపరుడు. అలుపెరగని వీరుడు. కార్యసాధనలో సవ్యసాచి. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రజలకు సమర్థవంతమైన సేవలందించడంలో దిట్ట. అందుకే ఆయన పాలన వైపు ప్రజలు మొగ్గు చూపారు. ఫలితంగా ఐదేళ్లు పాలించే అధికారం కట్టబెట్టారు. దీంతో ప్రజల రుణం తీర్చుకునే క్రమంలో బాబు కూడా నిరంతరం శ్రమిస్తున్నారు. పాలనలో వినూత్నంగా ఆలోచిస్తున్నారు. కార్యదక్షతతో పనులు చక్కబెట్టాలని ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే పనుల్లో తనదైన శైలి కనబరుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా అధికారం చేపట్టిన ఎన్డీయే ప్రభుత్వం పాలనను పరుగులు పెట్టిస్తోంది. ఐదు సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింపచేయాలంటే అధికారులు, ఉద్యోగులు కష్టపడి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేస్తున్నారు. విశాఖపట్నం వాసులకు చంద్రబాబు ప్రభుత్వం శుభవార్తను అందించింది. విశాఖ రీజియన్ కు కొత్తగా 44 సూపర్ లగ్జరీ బస్సులు రాబోతున్నాయి. ఈ నెలాఖరుకు ప్రయాణికులకు ఇవి దశలవారీగా అందుబాటులోకి వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో కాలం చెల్లిన బస్సులే ఉన్నాయి. దీంతో పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను తీసుకొస్తున్నారు. ఇప్పటివరకు విశాఖపట్నం డిపోకు 11 సూపర్ లగ్జరీ బస్సులతోపాటు ఒక అల్ట్రా డీలక్స్ బస్సు వచ్చాయి. మరో 33 సూపర్ లగ్జరీ బస్సులు రానున్నాయి. కొత్త బస్సులను అంతర్రాష్ట్ర సర్వీసులుగా నడిపించాలని అధికారులు నిర్ణయించారు. భీమవరం, విజయవాడ, తిరుపతి, కడప, శ్రీశైలం, శ్రీకాకుళం, పలాస, హైదరాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, కోరాపుట్, రాజమండ్రి, కాకినాడ, పర్లాకిమిడి, ఖమ్మం, నల్గొండ, భద్రాచలం వంటి ప్రాంతాలకు వీటిని తిప్పనున్నారు. మరమ్మత్తులు నిర్వహించడంతోపాటు ఆధునికీకరించి తిప్పబోతున్నారు.



# రిటైర్డ్ ప్రిన్సిపాల్ పెద్ద మనసు

## బసవతారకం హాస్పిటల్‌కు రూ.కోటి విరాళం

**విశ్వంభర, అమరావతి :** బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు రిటైర్డ్ ప్రిన్సిపల్ భారీ విరాళం అందజేశారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్ రమాదేవి కోటి రూపాయల విరాళాన్ని హాస్పిటల్‌కు దానం చేశారు. ఆమె తదనంతరం ఆ ఆస్తి హాస్పిటల్‌కి చెందేలా వీలునామా రాశారు. ఈ మేరకు వీలునామాకి సంభందించిన డాక్యుమెంట్స్ ని ఆమె సంరక్షకులు అమరావతిలో సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకి అందజేశారు. ఈమె గతంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళ డిగ్రీ కాలేజ్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం పదవీ విరమణ చేశారు. ఈమెకు ముగ్గురు కుమారులు. వారందరూ అమెరికాలో స్థిరపడ్డారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు క్యాన్సర్ చికిత్స అందించడంలో బసవతారకం హాస్పిటల్ కు మంచి పేరు ఉంది. క్యాన్సర్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్న బసవతారకం హాస్పిటల్ కు తన ఆస్తిని అందించడం ఆనందంగా ఉందని ఆమె అన్నారు. అవసరం అయితే అమరావతి అభివృద్ధికి కూడా తన వంతు సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె సంరక్షకులు తెలిపారు. ప్రస్తుతం బసవతారకం ఇండో అమెరికన్ హాస్పిటల్ తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో సేవలు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని టీడీపీ ప్రభుత్వం హయాంలో హాస్పిటల్ కోసం స్థలం కేటాయించారు. తర్వాతి కాలంలో ప్రభుత్వం మారడంతో ఆ దిశగా అడుగులు పడలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో త్వరలోనే ఆంధ్రప్రదేశ్ లోనూ హాస్పిటల్ నిర్మాణం చేపడతామని చైర్మన్ నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ లో ఈ క్యాన్సర్ హాస్పిటల్ ఉంది. సుమారు 650 పడకలు గల ఈ హాస్పిటల్ మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, అంకో పాథాలజీ, లాబొరేటరీస్, ఇతర సేవలు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో హాస్పిటల్ నిర్మాణం పూర్తి అయితే ఏపీ నుంచి క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్ వచ్చే వారి తిప్పలు తిరనున్నాయి.

# పాత్రికేయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

## కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వినతి

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టాప్ తెలుగు టీవీ యూట్యూబ్ ఛానల్‌లో కెమెరామెన్‌గా పనిచేసే 21ఏళ్ల కక్కెర్ల అఖిల్ జూన్ 29న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఈనెల 1న హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో కన్ను మూశాడు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం జీలుగులకు చెందిన అఖిల్ ది అత్యంత నిరుపేద కుటుంబం. తండ్రి మెకానిక్ షాప్ లో హెల్పర్. తల్లి కూలీ పని చేస్తుంది. చేతికందిన చెట్టంత కొడుకు, ఇంటికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, తగిన విధంగా ఆర్థిక సాయం చేసి అండగా నిలబడాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన




కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్కెర్ల అఖిల్ నిరుపేద కుటుంబమని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ తరఫున కోరుతున్నట్లు తెలిపారు.

# వైసీపీ పాలనలో విద్యుత్ రంగం కుదేలు

## లెక్కలు తేలుస్తున్న సీఎం చంద్రబాబు

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను సీఎం గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పొరపాట్ల వల్ల ఎలాంటి నష్టాలు ఏర్పడుతున్నాయో వివరిస్తున్నారు. దీని వల్ల చోటుచేసుకుంటున్న పరిణామాలను వివరిస్తూ బాబు శ్వేతపత్రం విడుదల చేశారు. విద్యుత్ రంగాన్ని గాడిన పడేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏపీలో గత ఐదేళ్ల పాలనలో వివిధ రంగాలు ఎలా నష్టపోయాయో ప్రజలకు వివరించేందుకు సీఎం చంద్రబాబు వరుసగా శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో ఇవాళ విద్యుత్ రంగ తాజా పరిస్థితిపై ఆయన శ్వేతపత్రం విడుదల చేసారు. ఇందులో గత వైసీపీ పాలనలో విద్యుత్ రంగం ఎలా విధ్వంసమైందో, ఛార్జీల పెంపు నిరాటంకంగా ఎలా కొనసాగిందో గణాంకాలతో పాటు వివరించారు. దీన్ని సరిదిద్దేందుకు త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు అంశాలు ఇబ్బందికరంగా ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. ఏ అంశాలు ఎలా ధ్వంసం అయ్యాయో తవ్వే కొద్ది వెలుగు చూస్తున్నాయన్నారు. అన్ని శాఖల్లో నూ ఇదే పరిస్థితి ఉందన్నారు. అందుకే రాష్ట్రానికి బాధ్యతా యుతమైన నాయకుడు ఉండాలి



దీనిపై ఆలోచించమని ప్రజలకు చెబుతున్నామన్నారు. రాష్ట్ర భవిష్యత్ ను దారుణం గా దెబ్బ తీశారన్నారు. మెరుగైన పాలన ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. విద్యుత్ ఎప్పుడూ అభివృద్ధి కి సూచికే అని తెలిపారు. 1995 - 2004 లో తొలిసారి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు తెచ్చామని చంద్రబాబు గుర్తుచేశారు. 2019-24 లో మధ్య గత ప్రభుత్వ హాయంలో 1,29 లక్షల కోట్ల అప్పులు విద్యుత్ సంస్థలు పై తెచ్చారన్నారు. 2019-24 మధ్య విద్యుత్ టారిఫ్ కూడా పెరిగింది. ప్రజల పై భారం మోపారన్నారు. విద్యుత్ సంస్థలు నష్టాలు చవిచూశాయన్నారు. 1995-2004 మధ్య విద్యుత్ సంస్కరణ ల్లో భాగం గా విద్యుత్ నియంత్రణ మండలి దేశంలోనే ఏర్పాటు అయ్యిందన్నారు. విద్యుత్ సంస్కరణ ల వల్ల అప్పట్లో మా ప్రభుత్వం ఓడిపోయినా విద్యుత్ సంస్కరణ లు గెలిచాయన్నారు. ఏపీకి విద్యుత్ మిగులు కూడా వచ్చిందన్నారు. 2014 నుంచి లో విద్యుత్ ఉత్పత్తి 9453 మెగా వాట్ల మేర పెంచామని చంద్రబాబు తెలిపారు. తలసరి వినియోగం ఏపీ లో 1234 యూనిట్ లకు పెరిగిందన్నారు. 2018 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రం గా ఏపీ ఎదిగిందన్నారు. మొత్తంగా 2018-19 నాటికి 14,929 మెగా వాట్ ల ఉత్పత్తికి చేరేలా కృషి చేశామన్నారు. ఆ తర్వాత జరిగిన విధ్వంసం కారణంగా తిరిగి ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయన్నారు. వీటిని సరిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు చంద్రబాబు వివరించారు.

# కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ మంత్రులు



**విశ్వంభర, విజయవాడ :** తెలంగాణ మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు బెజవాడ ఇంద్రకీలాద్రీపై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మను మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ ద్వారం వద్ద మేళతాళాలతో బాబు దంపతులకు వేదపండితులు స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు చేసిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కాగా, సోమవారం మంగళగిరిలో నిర్వహించిన దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సభలో మంత్రులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను కూడా ఆహ్వానించిన విషయం తెలిసిందే అందులో భాగంగా వేడకలకు హాజరైన మంత్రులు అనంతరం కనుకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.



# 16 నుంచి ఏపీ కేబినెట్ సమావేశాలు షురూ

## కీలక విషయాలపై ఫోకస్

**విశ్వంభర, విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి కేబినెట్ సమావేశాలు జరగనున్నాయి. ఇందులో కీలక విషయాలపై చర్చలు కొనసాగే అవకాశం ఉంది. బడ్జెట్ గురించి ప్రధాన చర్చ సాగనుందని తెలుస్తోంది. ఈ నెల 16 నుంచి అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండోసారి కేబినెట్ భేటీ కాబోతోంది. ఇప్పటికే కీలక హామీలతో పాటు శ్వేతపత్రాలపై దృష్టిపెట్టిన ప్రభుత్వం.. త్వరలో మరిన్ని కీలక నిర్ణయాల దిశగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 16న కేబినెట్ భేటీ ఏర్పాటు చేస్తోంది. ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డ అసెంబ్లీ బడ్జెట్ భేటీ నిర్వహించాలా లేక ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పై ఆర్డినెన్స్ జారీ చేయాలా అన్న దానిపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ఈ నెల 16న వెలగపూడిలోని సచివాలయంలో సమావేశం కానున్న ఏపీ కేబినెట్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ తో పాటు పలు అంశాలపై చర్చించబోతోంది. ఇందులో సంక్షేమ పథకాల అమలు కూడా ఉంది. ఇప్పటికే ఎన్డీయే ఎన్నికల హామీల్లో భాగమైన పెన్షన్ల పెంపుతో పాటు మరో నాలుగు అంశాలను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మిగిలిన వాటిపై ఈసారి కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఇందులో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో పాటు మరికొన్ని అంశాలున్నాయి. వీటికి కేబినెట్ ఆమోద ముద్ర వేసే అవకాశముంది. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వం ఇంకా కుదురుకోకపోవడంతో మరో రెండు, మూడు నెలల కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ద్వారా నిధుల విడుదలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. దీనిపై ఆర్డినెన్స్ విడుదలకు వీలుగా కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది.




# కిడ్నీ రాకెట్‌ను అణచివేస్తాం

- మరోసారి ఇలాంటి ఘటనలు జరగవు
- హెూంమంత్రి అనిత వంగలపూడి

**విశ్వంబర, విశాఖపట్నం :** విజయవాడలో బయటపడ్డ కిడ్నీ రాకెట్ వ్యవహారంపై ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు కలెక్టర్, ఎస్పీ, విజయవాడ సీపీకి ఫోన్ చేసి.. ఈ వ్యవహారంపై ఆరా తీశారు. డబ్బు ఆశచూపి కిడ్నీ కాజేసిన ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజయవాడ సీపీని హెూం మంత్రి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా పెట్టాలని సూచించారు.


### అసలేం జరిగిందంటే..

గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబు చిన్నపాటి వ్యా పారాలు చేసి కుటుంబాన్ని పోషించేవాడు. కరోనా తర్వాత ఆర్థికంగా చితికిపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. కుటుంబాన్ని పోషించేందుకు ఆటో డ్రైవర్‌గా మారాడు.. కానీ గతంలో చేసిన అప్పులు మాత్రం తీర్చలేని దుస్థితిలో ఉండిపోయాడు. ఇలాంటి సమయంలోనే బాషా అనే వ్యక్తి సోషల్‌మీడియాలో మధుబాబుకు పరిచయమయ్యాడు. కిడ్నీ అమ్మి డబ్బులు సంపాదించుకోవచ్చని సలహా ఇచ్చాడు. తాను కూడా గతంలో అలాగే ఓ కిడ్నీ అమ్మేసుకున్నానని నమ్మబలికాడు. దీంతో మధుబాబు కూడా కిడ్నీ అమ్మేందుకు సిద్ధమయ్యాడు. ఇదే విషయం బాషాకు చెప్పడంతో అతను వెంకట్ అనే మరో వ్యక్తిని పరిచయం చేశాడు.

వెంకట్ ద్వారా కిడ్నీ అమ్ముకుంటే రూ.30 లక్షలు ఇస్తాడని బాషా నమ్మబలికాడు. దీంతో వెంకట్ అడిగిన వివరాలన్నీ మధుబాబు చెప్పాడు. కొద్ది నెలల పాటు నెలవారీ ఖర్చులు కూడా వెంకట్ ఇచ్చాడు. ఈ క్రమంలో గత నెల 15వ తేదీన విజయవాడలోని విజయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లి మధుబాబుకు ఆపరేషన్ చేయించి కిడ్నీ తీసుకున్నాడు. దాన్ని వేరే వ్యక్తికి సెట్ చేశారు. ఆపరేషన్ తర్వాత మధు బాబుకు ఒప్పందం ప్రకారం రూ.30 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం 1.10 లక్షలు మాత్రమే ఇచ్చారు. అదేంటి మిగిలిన డబ్బులు ఇవ్వాలని మధుబాబు అడగ్గా.. వెంకట్ తన నిజస్వరూపం బయటపెట్టాడు. పేషెంట్ స్నేహితుడిలా కిడ్నీ దానం చేసినట్లు సంతకం చేశావు.. నీకు డబ్బులు ఎందుకివ్వాలని మధుబాబును ఎదురు ప్రశ్నించాడు. నీకు మిగిలిన డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ బెదిరించాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. డాక్టర్ శరత్‌బాబు, మధ్యవర్తులపై గుంటూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేశాడు. ఈ ఘటన కాస్త సంచలనంగా మారడంతో హెూం మంత్రి స్పందించారు.

# సౌతాఫ్రికాపై భారత్ గెలుపు

## సిరీస్ సమం




**విశ్వంభర, స్పోర్ట్స్ :** సిరీస్ డిసైడర్ అయిన మూడో టీ20లో భారత మహిళల జట్టు పంజా విసిరింది. బౌలింగ్ యూనిట్ అద్భుతంగా రాణించడంతో దక్షిణాఫ్రికాకు దడ పుట్టించింది. పూజా వస్త్రాకర్(413), రాధా యాదవ్(36)లు కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేయగా పర్యాటక జట్టును హర్మన్‌ప్రీత్ సేన 84 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం స్వల్ప ఛేదనలో ఓపెనర్ స్మృతి మంధాన(54 నాటౌట్) హాఫ్ సెంచరీతో కదం తొక్కగా 10 వికెట్ల విజయం సాధించింది. షఫాలీ వర్మ(27 నాటౌట్) సైతం దంచేయడంతో భారత జట్టు 10.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి సఫారీలపై భారీ విజయాన్ని నమోదు చేసింది. దాంతో ఇరుజట్లు 1-1తో సిరీస్ పంచుకున్నాయి. సొంతగడ్డపై భారత మహిళల జట్టు మరోసారి అబ్బురపరిచే ప్రదర్శన చేసింది. బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్.. అన్ని విభాగాల్లో ఆధిపత్యం చెలాయించి దక్షిణాఫ్రికా సిరీస్ ఆశలపై నీళ్లు చల్లింది. గత రెండు మ్యాచుల్లో చిదంబరం స్టేడియంలో తడబడిన హర్మన్‌ప్రీత్ సేన ఆఖరి టీ20లో అదరగొట్టింది . ఆల్‌రౌండర్ పూజా వస్త్రాకర్ (4/13), రాధా యాదవ్(3/6)లు బంతితో చెలరేగిన వేళ సఫారీలను తొలుత 84 పరుగులకే కట్టడి చేసింది. అనంతరం చిన్న లక్ష్య ఛేదనలో ఓపెనర్లు స్మృతి మంధాన(54 నాటౌట్), షఫాలీ వర్మ లు ధాటిగా ఆడారు. తొలి ఓవర్ నుంచే దక్షిణాఫ్రికా బౌలర్లపై ఎదురు దాడికి దిగారు. డస్సి పడిపోయిన పర్యాటక జట్టు బౌలర్లను ఉతికేస్తే ఇద్దరూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. ఇక డి క్లెర్క్ వేసిన 11 వ ఓవర్లో రెచ్చిపోయిన మంధాన.. రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో జట్టును గెలిపించడమే కాకుండా ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. దాంతో ఇరుజట్లు 1-1తో సిరీస్ పంచుకున్నాయి.

# ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన యూవీ



**విశ్వంభర, స్పోర్ట్స్ :** మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను బుక్ చేసుకున్న ఫ్లాట్‌ను డెలివరీ చేయడంలో జాప్యం జరుగుతుందని.. తనకు, రియల్ ఎస్టేట్ కంపెనీకి మధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు మధ్యవర్తిని నియమించాలని కోర్టును కోరారు. ఈ మేరకు కోర్టు రియల్ ఎస్టేట్ కంపెనీకి నోటీసులు జారీ చేసింది. రియల్ ఎస్టేట్ సంస్థ బ్రిలియంట్ ఎటోయిల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించారని, కంపెనీ తాను బుక్ చేసిన ఫ్లాట్ డెలివరీలో జాప్యం జరిగిందని యూవీ ఆరోపించారు. మాజీ క్రికెటర్ 2021లో ఢిల్లీలోని హౌస్‌ఖాన్ సంస్థతో ఒక ఫ్లాట్ బుక్ చేశారు. ఆ సమయంలో ఫ్లాట్ ధర రూ.14.10కోట్లుగా పేర్కొన్నాడు. యూవీకి నవంబర్ 2023లో స్వాధీనం చేసుకోవాలని కంపెనీ నుంచి లెటర్ వచ్చింది. ఫ్లాట్‌ను సందర్శించిన సమయంలో పనుల్లో నాణ్యత లోపించిందని.. బిల్డర్ మెటీరియల్స్ రాజీ పడ్డారని, అపార్ట్‌మెంట్ ఫిట్టింగ్‌లు, ఫర్నిషింగ్‌లు, లైటింగ్, ఫినిషింగ్ నాణ్యత ఏమాత్రం బాగాలేదని పేర్కొన్నారు. ఫ్లాట్ డెలివరీలో జాప్యం, నాసిరకం మెటీరియల్స్ వాడినందుకు నష్టపరిహారం చెల్లించాలని యూవీ కోరారు. డెవలపర్ తన బ్రాండ్ విలువను దుర్వినియోగం చేశాడని.. ఒప్పంద కాలానికి మించి తన వ్యక్తిత్వ హక్కులను ఉపయోగించడం ద్వారా అవగాహన ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించినట్లుగా ఆరోపించారు. నవంబర్ 2023 తర్వాత ప్రాజెక్టు ఎంఓయూ రద్దయినా బిల్‌బోర్డులు, ప్రాజెక్ట్ సైట్‌లు, సోషల్ మీడియా పోస్టుల్లో తన ఫొటోలను ఉపయోగించారని పేర్కొన్నారు.

## దాదాగిరి' రియాలిటీ షో క్రేజ్

# మాములుగా లేదుగా..



**విశ్వంభర, స్పోర్ట్స్ :** సౌరవ్ గంగూలీ 2009 నుంచి 'దాదాగిరి' అనే రియాల్టీ షోకి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది పశ్చిమ బెంగాల్‌లోని వివిధ జిల్లాల నుంచి పోటీదారులను ఎంపిక చేసే క్విజ్ షో. ఈ క్విజ్ షోకి ఫన్నీ యాంగిల్ కూడా ఇస్తుంటారు. ఈ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' వంటి సీరియస్‌నెస్, హాస్యం రెండింటినీ మిక్స్ చేసి నిర్వహిస్తున్నారు. అనేక రౌండ్లు ఉన్న ఈ షోలో ప్రైజ్ మనీ భారీగానే ఉంది. టీమిండియా మాజీ క్రికెటర్, బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రస్తుతం క్రికెట్ వ్యాఖ్యాతగా కనిపిస్తున్నారు. దీనితో పాటు, అతను బెంగాలీ టీవీ ఛానెల్‌లో రియాలిటీ షోను కూడా హోస్ట్ చేస్తున్నాడు. సౌరవ్ గంగూలీ 2009 నుంచి ఈ రియాలిటీ షోను హోస్ట్ చేస్తున్నాడు. ప్రస్తుతం రియాలిటీ షో పదవ సీజన్‌ను హోస్ట్ చేస్తున్నాడు. బెంగాల్‌లో సినీ నటుల కంటే ఎక్కువ పాపులర్ అయిన గంగూలీ రియాల్టీ షోకి సహజంగానే టీఆర్‌పీ రేటింగ్ ఎక్కువగా ఉంటుంది. అందుకు తగ్గట్టుగానే ఆ షో హోస్ట్‌గా వ్యవహరించినందుకు గంగూలీకి భారీ జీతం వస్తుంది. ఆ షో పేరు 'దాదాగిరి'. ఇది పశ్చిమ బెంగాల్‌లోని వివిధ జిల్లాల నుంచి పోటీదారులను ఎంపిక చేసే క్విజ్ షో. ఈ క్విజ్ షోకి ఫన్నీ యాంగిల్ కూడా ఇస్తుంటారు. ఈ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' వంటి సీరియస్‌నెస్, హాస్యం రెండింటినీ మిక్స్ చేసి నిర్వహిస్తున్నారు. అనేక రౌండ్లు ఉన్న ఈ షోలో ప్రైజ్ మనీ భారీగానే ఉంది. కానీ, సౌరవ్ గంగూలీ షోలో పాల్గొన్న అందరి కంటే ఎక్కువ సంపాదిస్తున్నాడు. పదో సీజన్ కోసం సౌరవ్ గంగూలీ ఈ షో ద్వారా భారీ మొత్తంలో సంపాదిస్తున్నాడు. ఒక్కో ఎపిసోడ్‌కి గంగూలీకి రూ.50 లక్షల పారితోషికం తీసుకుంటున్నాడంట. ఈ షో ద్వారా సౌరవ్ గంగూలీ నెలకు దాదాపు నాలుగు కోట్ల రూపాయలు జేబులో వేసుకుంటున్నాడు. ఇది బెంగాల్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన షో. ఇది వారానికి రెండు రోజులు మాత్రమే ప్రసారం అవుతుంది. సౌరవ్ గంగూలీ 2009 నుంచి ఈ షోను హోస్ట్ చేస్తున్నాడు. అయితే మూడవ సీజన్‌లో గంగూలీ స్థానంలో బెంగాలీ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి వచ్చారు. కానీ అతను ఆ సీజన్ తర్వాత తొలగించబడ్డాడు. గంగూలీకి తిరిగి వచ్చాడు. గంగూలీ కాస్త సీరియస్ స్వభావాన్ని కలిగి ఉన్నప్పటికీ, కంటెస్టెంట్స్‌తో లైట్ జోకులు వేస్తుంటాడు.




## హైదరాబాద్‌లో మరో ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** నగరంలో మరో ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ బ్యాడ్మింటన్ గురు పుల్లెల గోపీచంద్ నగరంలో మూడో అకాడమీని ప్రారంభించాడు. ఇప్పటికే రెండు అకాడమీలతో ఎంతోమందిని తీర్చిదిద్దిన గోపీచంద్‌తో కలిసి కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ తమ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ గచ్చిబౌలిలో అంతర్జాతీయ ప్రమాణాలతో హై ఫెర్ఫార్మెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఆరు కోర్టులు, పూర్తిస్థాయి స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, సింథటిక్ ట్రాక్, కోచ్ డెవలప్‌మెంట్ కోర్సు సదుపాయం ఉన్నాయి. కార్యక్రమంలో అకాడమీ ట్రస్టీ ఎల్వీ సుబ్రహ్మణ్యం, కోటక్ మహీంద్రా బ్యాంకు హోల్ టైం డైరెక్టర్ శాంతి ఏకాంబరం, కోటక్ గ్రూప్ ప్రెసిడెంట్ జైమిన్ భట్, సైనా నెహ్వాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో అకాడమీ నెలకొల్పాలన్న తన ప్రతిపాదనకు వెంటనే అంగీకరించినందుకకు కోటక్ మహీంద్రా బ్యాంకుకు గోపీచంద్ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ అకాడమీ నుంచి మరికొందరు ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్లు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశాడు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు అంతర్జాతీయ స్థాయి కోచ్‌లతో పాటు అధునాతన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు అందిస్తున్నట్టు చెప్పాడు.

## టీమిండియా హెడ్ కోచ్‌గా

# గౌతమ్ గంభీర్..



**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత పురుషుల క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియమితులైనట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి ధృవీకరించింది. భారత మాజీ ఓపెనర్ మూడేళ్ల కాంట్రాక్ట్‌పై సంతకం చేసిన ఈ దిగ్గజ ఆటగాడు.. రాహుల్ ద్రవిడ్‌కు వారసుడిగా మారాడు. టీమిండియా 2011 ప్రపంచ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన గంభీర్, అశోక్ మల్హోత్రా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల క్రికెట్ సలహా కమిటీ, జూమ్ ద్వారా రామన్‌తో కలిసి ఇంటర్వ్యూ చేసింది. చివరకు ఈ కమిటీ గంభీర్‌ను సిఫార్సు చేసింది. దీంతో నేడు గంభీర్‌ను హెడ్ కోచ్‌గా ప్రకటించారు. కాగా, గంభీర్ అధికారికంగా జులైలో తన పదవీకాలాన్ని ప్రారంభిస్తాడు. తదుపరి ప్రపంచ కప్ అంటే, డిసెంబర్ 31, 2027 వరకు ఈ పదవీలో ఉంటాడు. గంభీర్ ఎన్నడూ అధికారికంగా జట్టుకు కోచ్‌గా చేయనప్పటికీ.. అతను ఫ్రాంచైజీలు లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మెంటార్‌గా అనుబంధం కలిగి ఉన్నాడు. ప్రధాన కోచ్‌కి దరఖాస్తు గడువుకు ఒక రోజు ముందు మే 26న మూడవ టైటిల్ సాధించి సత్త చూపించాడు గంభీర్. అయితే, బీసీసీఐ రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్‌లను ఈ పోస్ట్ కోసం పరిశీలిస్తున్నట్లు ప్రాథమిక నివేదికలు సూచించాయి. అయితే, బీసీసీఐ సెక్రటరీ జైషా ఈ వాదనలను ఖండించారు. బోర్డు మాజీ ఆస్ట్రేలియా క్రికెటర్లను సంప్రదించలేదని, భారత కోచ్‌ని నియమించడంపై దృష్టి పెట్టిందని పేర్కొన్నాడు.

**జైషా అభినందనలు..**

"భారత క్రికెట్ జట్టు కొత్త ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్‌ని నేను స్వాగతిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఆధునిక క్రికెట్ వేగంగా అభివృద్ధి చెందింది. గౌతమ్ ఈ మార్పును దగ్గరగా చూశాడు. తన కెరీర్‌లో వివిధ పాత్రల్లో రాణించి, కష్టాలను తట్టుకుని, భారత క్రికెట్‌ను ముందుకు నడిపించడానికి గౌతమ్ ఆదర్శవంతమైన వ్యక్తి అని నాకు నమ్మకం ఉంది"అంటూ జైషా రాసుకొచ్చారు." టీమిండియా పట్ల అతని స్పష్టమైన దృష్టి, అపారమైన అనుభవంతో పాటు, ఈ ఉత్తేజకరమైన కోచింగ్ పాత్రను స్వీకరించేందుకు ఆహ్వానం అందిస్తున్నాం. ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించేందుకు బీసీసీఐ అతనికి పూర్తిగా మద్దతు ఇస్తుంది" అంటూ ట్వీట్ చేశాడు.

## వంటగ్యాస్ కస్టమర్ల ఈ-కేవైసీకి నో డెడ్ లైన్



**విశ్వంభర, బిజినెస్ :** వంట గ్యాస్ సిలిండర్ల వినియోగదారుల ఈ-కేవైసీ ప్రక్రియకు ఎటువంటి తుది గడువు లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేశారు. 2023లోనే ఎల్పీజీ ఈ-కేవైసీ ప్రక్రియ చేపట్టాలని కేంద్ర చమురు సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా గ్యాస్ ఏజెన్సీలు తమ కస్టమర్ల ఈ-కేవైసీ ప్రక్రియ మొదలు పెట్టాయి. గ్యాస్ ఏజెన్సీల వద్దే ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని కొన్ని సంస్థలు పట్టుబట్టడంతో వంట గ్యాస్ వినియోగదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కేరళ అసెంబ్లీలో విపక్ష నేత వీడీ సతీశన్ లేఖ రాశారు. సతీశన్ లేఖపై ప్రతి స్పందించిన హర్దీప్ సింగ్ పూరీ.. ఎల్పీజీ ఏజెన్సీ సంస్థల్లోనే తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలన్న నిబంధన లేదని స్పష్టం చేశారు. కేంద్ర చమురు సంస్థలు తమ వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యాన్ని కలిగించబోవని పేర్కొన్నారు. 'బోగస్ కస్టమర్ల తొలగింపునకు కేంద్ర ప్రభుత్వ చమురు సంస్థలు గత ఎనిమిది నెలలుగా ఈ-కేవైసీ ఆధార్ అథంటికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. వంట గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలోనే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డెలివరీ సిబ్బంది కస్టమర్ల వివరాలు ధృవీకరిస్తారు. డెలివరీ సిబ్బంది తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్లలోని యాప్ సాయంతో కస్టమర్ల ఆధార్ వివరాలను నమోదు చేసుకుని ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. కస్టమర్లు తమ సౌలభ్యానికి అనుగునంగా సమీపంలోని డిస్ట్రిబ్యూటర్ షోరూమ్ కు వెళ్లి కూడా ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేయొచ్చు. అలాగే కేంద్ర చమురు సంస్థల యాప్‌లు ఇన్ స్టాల్ చేసుకుని సొంతంగా ఈ-కేవైసీ అప్ డేట్ చేయొచ్చు' అని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు.


## 20 లక్షల మైలురాయి దాటిన ఎస్‌యూవీ కార్లు

**విశ్వంభర, బిజినెస్ :** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ కీలక మైలురాయిని చేరుకున్నది. టాటా పంచ్ , టాటా నెక్సాన్, టాటా హారియర్, టాటా సఫారీ (ఓల్డ్ అండ్ న్యూ), టాటా సియర్రా వంటి తమ ఎస్‌యూవీ కార్ల విక్రయాలు 20 లక్షల మైలురాయిని దాటాయని మంగళవారం టాటా మోటార్స్ ప్రకటించింది. 1991లో టాటా మోటార్స్ దేశీయ మార్కెట్లో తొలిసారి ఎస్‌యూవీ టాటా సియర్రా కారును ఆవిష్కరించింది. అటుపై 2014 ఆటో ఎక్స్ పోలో టాటా నెక్సాన్, సబ్ కంపాక్ట్ ఎస్‌యూవీ కారు టాటా పంచ్ కార్లను మార్కెట్లోకి తెచ్చింది. తన ఎస్‌యూవీ కార్ల విక్రయాలు 20 లక్షల మైలురాయిని దాటిన సందర్భంగా వాటిపై రూ.1.40 లక్షల దేశంలోని ఇతర కార్ల తయారీ కంపెనీలతో పోలిస్తే టాటా మోటార్స్ కార్లన్నీ గ్లోబల్ ఎన్-క్యాప్, భారత్ ఎన్-క్యాప్ వద్ద 5-స్టార్ సేఫ్టీ రేటెడ్ కార్లుగా ఉన్నాయి. ఇక టాటా హారియర్ రూ.14.99 లక్షలు (ఎక్స్ షోరూమ్), టాటా సఫారీ రూ.15.49 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతున్నాయి. వీటిలో సెలెక్టెడ్ వేరియంట్లపై రూ.1.40 లక్షల వరకూ డిస్కౌంట్ అందిస్తున్నది. వీటితోపాటు టాటా నెక్సాన్. ఈవీ కారుపై రూ.1.30 లక్షలు, టాటా పంచ్.ఈవీ కారుపై రూ.30 వేల డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది. తన ఎస్‌యూవీ కార్లపై ఆఫర్లు ఈ నెల 31 వరకూ ప్రీ బుకింగ్స్ చేసుకున్న వారికి అందుబాటులో ఉంటాయని టాటా మోటార్స్ తెలిపింది. వరకూ డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపింది.

## ఆ పథకాల్లో పెట్టుబడితో

# రిస్క్ తక్కువ లాభం ఎక్కువ

**విశ్వంభర, బిజినెస్ :** పెట్టుబడిదారులు తమ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ ప్రొఫైల్, పెట్టుబడి హారిజోన్‌కు అనుగుణంగా సరైన సంపద సృష్టి ఎంపికలను ఎంచుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. రిస్క్‌లను తగ్గించడానికి, రాబడిని పెంచడానికి పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వివిధ రంగాల్లో వైవిధ్యపరచాలని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అందుబాటులో కొన్ని ఉత్తమ పెట్టుబడి ఎంపికల గురించి తెలుసుకుందాం. భారతదేశంలో ఇటీవల కాలంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత పెరిగింది. ఈ నేపథ్యంలో స్థిర ఆదాయన్ని ఇచ్చే పథకాలతో పాటు స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ వంటి వివిధ పెట్టుబడి రంగాల్లో పెట్టుబడి పెట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పెట్టుబడిదారులు తమ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ ప్రొఫైల్, పెట్టుబడి హారిజోన్‌కు అనుగుణంగా సరైన సంపద సృష్టి ఎంపికలను ఎంచుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. రిస్క్‌లను తగ్గించడానికి, రాబడిని పెంచడానికి పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వివిధ రంగాల్లో వైవిధ్యపరచాలని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అందుబాటులో కొన్ని ఉత్తమ పెట్టుబడి ఎంపికల గురించి తెలుసుకుందాం.



### ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులకు సంపద సృష్టి ఎంపిక. వివిధ రంగాలలోని కంపెనీల స్టాక్‌లలో పెట్టుబడి పెడతాయి. అలాగే దీర్ఘకాలికంగా అధిక రాబడిని అందిస్తూ ఉంటాయి. ఇతర పెట్టుబడి ఎంపికలతో పోలిస్తే అవి అధిక నష్టాలను కలిగి ఉంటాయి.

### డెట్ మ్యూచువల్ ఫండ్స్

డెట్ మ్యూచువల్ ఫండ్స్ బాండ్లు, డిబెంచర్లు, ప్రభుత్వ సెక్యూరిటీల వంటి స్థిర-ఆదాయ సెక్యూరిటీలలో పెట్టుబడి పెడతాయి. ఈక్విటీ ఫండ్స్‌తో పోలిస్తే ఈ ఫండ్‌లు తక్కువ రిస్క్‌తో కూడుకున్నవి. అలాగే సాధారణ ఆదాయం, మూలధన సంరక్షణ కోసం చూస్తున్న పెట్టుబడిదారులకు ఇది మంచి ఎంపిక.

### ఇండెక్స్ ఫండ్స్

ఇండెక్స్ ఫండ్స్ అంటే నిఫ్టీ 50 లేదా బీఎస్ఈ సెన్సెక్స్ వంటి నిర్దిష్ట ఇండెక్స్‌ను ట్రాక్ చేసే నిష్క్రియ పెట్టుబడి నిధులు. ఈ ఫండ్స్ అంతర్లీన ఇండెక్స్ పనితీరును ప్రతిబింబించే లక్ష్యంతో ఉంటాయి. అలాగే తక్కువ ధర పెట్టుబడి ఎంపికల కోసం వెతుకుతున్న పెట్టుబడిదారులకు ఇది మంచి ఎంపిక.

### రియల్ ఎస్టేట్

రియల్ ఎస్టేట్ అనేది మరొక ప్రసిద్ధ సంపద సృష్టి ఎంపిక. ఈ రంగంలో పెట్టుబడితో దీర్ఘకాలికంగా గణనీయ-మైన రాబడిని పొందే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడానికి గణనీయమైన మొత్తంలో మూలధనం అవసరం. ఇతర పెట్టుబడి ఎంపికలతో పోలిస్తే అధిక నష్టాలను కలిగి ఉంటుంది.

### బంగారం

వైవిధ్యం, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా రక్షణ కోసం వెతుకుతున్న పెట్టుబడిదారులకు బంగారం ఒక ప్రముఖ పెట్టుబడి ఎంపిక. బంగారాన్ని భౌతిక రూపంలో లేదా గోల్డ్ ఇటిఎఫ్‌లు (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్) లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ద్వారా పెట్టుబడి పెట్టవచ్చు.

### సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్

ఎస్ఐపీల ద్వారా సంపదను సృష్టించడం అనేది ఒక ప్రముఖ పెట్టుబడి వ్యూహం. ఇది మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లో నిర్ణీత వ్యవధిలో నిర్ణీత మొత్తంలో పెట్టుబడి పెడుతుంది. ఎస్ఐపీ అనేది పెట్టుబడికి సులభమైన, క్రమశిక్షణతో కూడిన మార్గంగా నిపుణులు పేర్కొంటున్నారు. ఇది పెట్టుబడిదారులను దీర్ఘకాలం పాటు సంపదను కూడగట్టుకోవడానికి అనుమతిస్తుంది.



## అనంత్ అంబానీ వెడ్డింగ్‌లో సారా అలీఖాన్ మెరుపులు

**విశ్వంభర, సినిమా:** అపర కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ ఇంట వెడ్డింగ్ సందడి కొనసాగుతున్న విషయం తెలిసిందే. ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ రాధికా మర్చంట్ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో భాగంగా హల్దీ సెర్మనీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలీవుడ్ యాక్టర్లు అర్జున్ కపూర్, జాన్వీకపూర్, అనన్యపాండే, సారా అలీఖాన్ తోపాటు పలువురు ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు. ఈవెంట్‌లో సారా అలీఖాన్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన సంప్రదాయ లెహెంగాలో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఇంతకీ పెళ్లి కూతురు సారా అలీఖానా.. ఏంటీ అన్నట్టుగా ఉన్న స్టన్నింగ్, మెస్మరైజింగ్ ఫొటోలు ఇప్పుడు నెటిజన్లకు కంటి మీద కనుకులేకుండా చేస్తున్నాయి. సంప్రదాయ వస్త్రధారణలో ఈవెంట్‌కు వచ్చిన సారా అలీఖాన్ గ్రీన్ కార్పెట్‌పై నడుచుకుంటూ వస్తుండగా చూపరులను ఆకట్టుకుంది.

## తంగలాన్ న్యూస్ షేర్ చేసిన మాళవికా మోహనన్

విశ్వంభర, సినిమా : కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ ఆధ్వర్యంలో రాబోతున్న సినిమాల్లో ఒకటి తంగలాన్. పా రంజిత్ దర్శకత్వంలో హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో మలబార్ సోయగం మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీమేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. విక్రమ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. తంగలాన్ ట్రైలర్ రేపు లాంచ్ కాబోతుందని తెలియజేసింది మాళవికా మోహనన్. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే లాంచ్ చేసిన తంగలాన్ గ్లింప్స్‌తో ఈ సినిమా బంగారం, రక్తం, కన్నీటి చుట్టూ సాగే కథగా అడ్వెంచరస్ స్టోరీ నేపథ్యంలో ఉండనుందని క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. తంగలాన్ నుంచి రిలీజ్ చేసిన విక్రమ్, మాళవికా మోహనన్ ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రంలో పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. విక్రమ్ కెరీర్‌లోనే తంగలాన్ ల్యాండ్ మార్క్ సినిమాగా నిలువనుందని ఇప్పటివరకు రిలీజ్ చేసిన రషెస్ చెప్పకనే చెబుతున్నాయి. ఇక ఈ సినిమాలో విక్రమ్ తన పాత్రకు న్యాయం చేసేందుకు ఎంత ప్రాణం పెట్టాడో తెలియజేస్తూ.. రిలీజ్ చేసిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేల్ రాజా తెరకెక్కిస్తుండగా.. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

## ఇంకాస్త సమయం ఉంటే బాగుండు



'కల్కి' నాగ్ అశ్విన్

**విశ్వంభర, సినిమా :** నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి' కలెక్షన్ల పరంగా రికార్డులు తిరగరాస్తూ సంచలనం సృష్టిస్తోంది. ఈ చిత్రం నిడివి 3.01 గంటలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రం విడుదలకు ముందు దీని నిడివి విషయంలో కొందరు విమర్శించారు. తాజాగా వీటిపై నాగ్ అశ్విన్ స్పందించారు. తనకు ఎంత టైమ్ ఉన్నా ఎడిట్ చేసేందుకు సరిపోదన్నారు. 'సినిమా కోసం పడిన కష్టమంతా దాని ఫలితం చూశాక మర్చిపోయాం. అన్ని ప్రాంతాల నుంచి వచ్చే ఆదరణ చూస్తుంటే ఆనందంతో పాటు భావోద్వేగంగా ఉంది. చిన్నచిన్న ప్రాంతాల్లోనూ మంచి విజయం సాధించింది. ఇలాంటి సినిమాల కోసం నాకు మరో నెల సమయం ఇచ్చినా సరిపోదు. ఇంకాస్త సమయం ఉంటే బాగుండునని భావిస్తాను. కొందరు దీని రన్‌టైమ్‌ను విమర్శించారు. నేను విమర్శలను కూడా పాజిటివ్‌గానే తీసుకుంటాను. ఎందుకంటే వాటిల్లో కూడా మనకు తెలియని పాయింట్లు చాలా ఉంటాయి. 'ఇది మొదటి భాగం. ఇందులోనే అన్ని పాత్రలను పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. అందుకే అంత రన్‌టైమ్ వచ్చింది. కొందరు దీన్ని 'మహానటి'తో పోలుస్తున్నారు. ఆ చిత్రానికి, కల్కికి చాలా తేడా ఉంది. రెండూ భిన్నమైన కథలు. అది కేవలం ఒక మహిళకు చెందిన కథ, ఆమె పాత్ర మాత్రమే ప్రధానమైనది. కానీ ఇందులో చాలామంది అగ్రతారలు ఉన్నారు. వాళ్ల పాత్రలన్నీ కీలకమైనవే. వాళ్ల పాత్ర చుట్టూ కథ అల్లుకుపోవాలి' అని చెప్పారు.






## నందిత శ్వేత సొగసుల సోయగం

**విశ్వంభర, సినిమా :** నందిత శ్వేత 30 ఏప్రిల్ 1990న కర్ణాటకలోని బెంగుళూరులో శ్వేతగా జన్మించింది. ఆమె తండ్రి వ్యాపారవేత్త మరియు ఆమె తల్లి గృహిణి. ఆమెకు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ఆమె క్రైస్ట్ యూనివర్సిటీలో డిగ్రీ పట్టా అందుకుంది ఈ ముద్దుగుమ్మ. శ్వేత స్కూల్‌లో చదువుతున్నప్పుడే ఉదయ మ్యూజిక్‌లో వీజేగా కెరీర్‌ని ప్రారంభించింది. ఆమె 2008 కన్నడ చిత్రం నంద లవ్స్ నందితలో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది. చిత్రంలో ఆమె పాత్రకు నందిత అని పేరు పెట్టారు, ఆ తర్వాత ఆమె తన స్క్రీన్ పేరుగా మార్చుకుంది. 2016లో ఎక్కడికి పోతావు చిన్నవాడా సినిమాతో టాలీవుడ్ అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ. ఈ సినిమాలో ఈ ముద్దుగుమ్మ నటనకి ఉత్తమ సహాయ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును గెలుచుకుంది. తర్వాత తెలుగు వరుస సినిమాలు చేస్తూ బిజీగా అయింది. 2018లో శ్రీనివాస కళ్యాణం సినిమా నితిన్ మరదలుగా ఆకట్టుకుంది ఈ బ్యూటీ. అదే ఏడాది హీరో సత్యదేవ్ సరసన బ్లఫ్ మాస్టర్ అనే మరో తెలుగు సినిమాలో కథానాయకిగా మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. 2019లో ప్రేమ కథా చిత్రం 2, అభినేత్రి 2, రాజశేఖర్ కల్కి చిత్రాల్లో ఆకట్టుకుంది. 2021 కపటధారి, అక్షర సినిమాలు చేసింది. 2022లో జెట్టీలో నటించింది. చివరి 2023లో హిడింబా, మంగళవారం సినిమాల్లో కనిపించింది. ప్రస్తుతం రా రా పెనిమిటి సినిమాలో నటిస్తుంది

'గౌండంపాళెయం' విడుదలకు

## సీఎం చొరవ చూపాలి

**విశ్వంభర, సినిమా :** 'గౌండంపాళెయం' చిత్రం విడుదలకు ముఖ్యమంత్రి స్టాలిన్ చొరవ చూపాలని దర్శక నటుడు రంజిత్ విజ్ఞప్తి చేశారు. ఆయన హీరోగా నటించి దర్శకత్వం వహించిన చిత్రం 'గౌండంపాళెయం'. ఈ నెల 5వ తేదీ విడుదల కావాల్సి ఉండగా, బెదిరింపుల కారణంగా చిత్రాన్ని విడుదల చేయలేదు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. 'ఈ చిత్రం విడుదలకు కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన నేతలు వ్యతిరేకిస్తూ, థియేటర్ యజమానులను బెదిరిస్తున్నారు. ఈ విషయంపై కోయంబత్తూరు పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. ఈ సినిమా విడుదలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సాఫీగా విడుదల చేసేందుకు చొరవ చూపించాలని ముఖ్యమంత్రి స్టాలిన్, సినిమాటోగ్రఫీ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయనున్నామన్నారు.




## లవర్‌ను పరిచయం చేసిన ఇనయ సుల్తానా

**విశ్వంభర, సినిమా :** గతంలో బిగ్‌బాస్ రియాల్టీ షో ద్వారా ఫేమస్ అయిన బ్యూటీ ఇనయా సుల్తానా. బిగ్‌బాస్ సీజన్ 6లో కంటెస్టెంట్ గా అడుగుపెట్టి తన ఆట తీరుతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యింది. ఇక ఈ షో నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా నెట్టింట యాక్టివ్ గా ఉంటుంది. అటు ఫోటోషూట్స్, రీల్స్ అంటూ తెగ హడావిడి చేస్తుంది. తాజాగా తాను ప్రేమలో ఉన్నాననే విషయాన్ని బయటపెట్టింది. ఈసారి ఏకంగా ప్రియుడిని కూడా పరిచయం చేసింది. ప్రస్తుతం ఇనయ షేర్ చేసిన వీడియో నెట్టింట తెగ వైరలవుతుంది. తాజాగా ఓ వ్యక్తితో క్లోజ్‌గా ఫోటోస్ దిగిన వీడియోను వీడియోను షేర్ చేసింది. అతడి పేరు గౌతమ్ కొప్పిశెట్టి. యోగా ట్రైనర్. జిమ్ కోచ్ అని ఇన్‌స్టాలో బయో చూస్తే తెలుస్తోంది. గతంలో జిమ్ లో ఏర్పడిన వీళ్ల పరిచయం ప్రేమగా మారిందేమో అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇనయ షేర్ చేసిన వీడియో పై నెటిజన్స్ రియాక్ట్ అవుతూ విభిన్నంగా కామెంట్స్ చేస్తున్నారు.

## లివర్ రక్షణ కోసం

**విశ్వంభర, ఫ్యూచర్ :** ఆరోగ్యంలో గుండెతోపాటు కాలేయం కూడా ముఖ్యపాత్ర పోషిస్తుంది. అయితే, గుండె గురించి తెలుసుకున్నంతగా కాలేయం గురించి చాలామందికి అవగాహన ఉండదు. శరీరంలో అతి పెద్ద గ్రంథి అయిన కాలేయం తనను తాను బాగు చేసుకునే సామర్థ్యం కలిగిన ఏకైక అవయవం. ఎవరికైనా కాలేయంలో కొంత భాగం దానమిచ్చినా మూడు నాలుగు నెలల్లో ముందు రూపంలోకి వస్తుంది. పైగా దానం తీసుకున్న వ్యక్తిలో కూడా కాలేయం పెరిగి పూర్తి రూపాన్ని దాలుస్తుంది. అందుకే కాలేయాన్ని మన శరీర డాక్టర్ అని పిలుస్తారు.

కానీ కొన్ని పదార్థాలు కాలేయాన్ని జబ్బుల బారినపడేస్తాయి. మితిమీరిన మద్యపానం, కొవ్వులు ఉన్న ఆహారం తినడం, తగినంత శారీరక శ్రమ లేకపోవడం లాంటివి కాలేయం ఆరోగ్యం మీద దుష్ప్రభావం చూపుతాయి. కాబట్టి, కాలేయం మేలు కోసం ఆహారం, జీవనశైలి విషయాల్లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం



తప్పనిసరి. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ఫైబర్ సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలు తినాలి. ఫైబర్ ఉన్న ఆహారాలు పొట్టను ఆరోగ్యంగా ఉంచుతాయి. బరువును తగ్గిస్తాయి. దీంతో కాలేయం మీద ఒత్తిడి తక్కువగా పడుతుంది. సలాడ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. సలాడ్లు తినడం వల్ల శరీరంలో పేరుకున్న టాక్సిన్లు బయటికి వెళ్లిపోతాయి.

నూనెలు, మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారం కాలేయానికి చేటు చేస్తుంది. అందువల్ల తక్కువ నూనెతో చేసినవి, డీప్ ఫ్రై చేయనివి తీసుకోవాలి. ఉడికించినవి, వేయించినవి తినడం మంచిది. పూరీలు, పరాఠాలు ఎక్కువగా తినకూడదు. కూరగాయల్లో కూడా నూనె తక్కువగా ఉపయోగించాలి.

కాలేయం సరిగ్గా పనిచేయాలంటే శరీరానికి తగినన్ని నీళ్లు అందాలి. కాబట్టి, రోజుకు కనీసం ఎనిమిది నుంచి పది గ్లాసుల నీళ్లు తాగాలి. దీంతో శరీరం నుంచి మలినాలు సహజంగా బయటికి విసర్జితమైపోతాయి. కాలేయమైనా, మరో ఇతర అవయవమైనా శరీరంలో కొవ్వు అధికంగా పేరుకోవడం ప్రమాదకరం. కాలేయం ఆరోగ్యానికి రోజూ ఏదో ఒక ఫిట్‌నెస్ వ్యాయామం తప్పకుండా చేయాలి. తిన్నది అరగడం కోసం నడవాలి. రోజుకు 40 నుంచి 45 నిమిషాలపాటు వ్యాయామం చేయాలి.

కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే అధిక చక్కెరలు ఉన్న ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోకూడదు. ప్యాక్‌డ్ పండ్లరసాలు, సాఫ్ట్ డ్రింక్స్‌ను దూరం పెట్టాలి. మద్యపానం కాలేయానికి బద్ధశత్రువు. కాబట్టి ఆల్కహాల్‌ను పూర్తిగా వదిలించుకోవాలి.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com